MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 9 రంగారెడ్డి మే 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## అన్నదాతల ఆధ్వర్యంలో 'తెలుగుదనం' సంస్కృతీ సంప్రదాయ కేంద్రాలు!



ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుకు ప్రతిపాదిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యమ నాయకుడు
శ్రీ విజయరామ్, శ్రీ కిరణ్, శ్రీమతి ఝాన్సీ , శ్రీ సురేంద్రనాథ్ బెనర్జీ బృందం



Silver Jubilee Year
July 2025 - June 2026
apmas
Empowering Communities




తెలంగాణాలోని ఏపిమాస్ ఎఫ్ పి ఓలను బలోపేతం చేయడంపై కార్యశాల దృశ్యం ...ఈ సందర్భంగా నాబార్డ్ తెలంగాణా
ఆర్ ఓ–సి జి ఎం శ్రీ ఉదయభాస్కర్ ను , వ్యవసాయశాఖ జె డి శ్రీ శ్రీనివాస్ ను సన్మానించిన ఏ పిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి




మాతాశిశు సమగ్ర పోషణపై ఏపిమాస్ ఆధ్వర్యంలో భాగస్వాముల సదస్సు .. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ ఛార్ట్ ఆవిష్కరణ

NABARD
నాబార్డ్ సౌజన్యంతో ....


# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు

## నీటి సంరక్షణ - యాజమాన్యం



సూక్ష్మ సాగు - స్ప్రింక్లర్




సూక్ష్మ సాగు - బిందుసేద్యం



పంటకు జీవం
రెయిన్‌గన్



భూగర్భ నీటిని
పంచుకోవడం



ఆరు తడి
పంటలసాగు



సోలార్
పంపుసెట్ల ఏర్పాటు

## భూసార, నీటి సంరక్షణ




గ్రిడ్ లాక్ పద్ధతి



పొలాలలో నీటి కుంటలు
(ఫార్మ్ పాండ్)



చిన్న చిన్న
ఊట కుంటలు



రాతి కట్టలు

NABARD

# మహిళా సాధికారత


సంపుటి 24 సంచిక 9



సంపాదకీయం

## సంసిద్ధత !

**తె**లుగు రాష్ట్రాలను మళ్ళీ రుతుపవనాలు పలకరించే తరుణం ఆసన్నమైంది. సాధారణంగా జూన్ నెల మొదటి వారంలో మనకు ఖరీఫ్ రుతుపవనాల వానలు రావాలి. మనకు ప్రధానమైన పంటకాలం కూడా యిదేకావడంతో అన్నదాతలు ఈ వానలపై ఎన్నో అశలు పెట్టుకుంటారు. క్రమేణా నీటి వనరులు, నీటిపారుదల సౌకర్యాలు కొంత మెరుగుపడుతున్నప్పటికి, యిప్పటికీ వర్షాధార భూముల విస్తీర్ణమే ఎక్కువ. అందుకే, ఈ రుతుపవనాలను రైతులు ప్రాణాధారంగా భావిస్తారు. కాని, యిటీవలి కాలంలో రుతుపవనాల రాకలోను, యిచ్చే ఫలితంలోను, చూపించే ప్రభావంలోను నిలకడతనం లోపిస్తున్నది. అందువల్ల రాబోయే పంటకాలాన్ని గురించిన సరైన ముందస్తు అవగాహనతో ఇటు రైతులు, అటు ప్రభుత్వాలు సంసిద్ధం కావలసి వుంటుంది. ఈసారి మనదేశంలో ఈ నైరుతి రుతుపవనాలు చాలా బలహీనంగా వుంటాయని, వర్షపాతం బాగా తగ్గుతుందని వాతావరణ సూచనలు పేర్కొంటున్నాయి. ఇది ఆందోళనకరమైన విషయమే అయినప్పటికీ, తెలుగు రాష్ట్రాలలో వానలు బాగానే కురుస్తాయని, వర్షపాతం సాధారణ స్థాయిలోనే వుంటుందన్న వాతావరణ నిపుణుల వివరణలు ఆశావహంగా వున్నాయి. అయినా, వాతావరణ జోస్యాలను నమ్మి దెబ్బతిన్న గత కొన్ని అనుభవాలతో, ఇక తగిన ముందు జాగ్రత్తలు పాటించడం మంచిది. వానలు సరిగ్గా కురవకపోయినా నష్టపోని పంటల ప్రణాళిక, నీరు–పొలాల నిర్వహణ, అవసరమైన విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను సమకూర్చుకోవడం, తగిన సాంకేతిక ఏర్పాట్ల వంటి ముందస్తు సంసిద్ధత అత్యవసరం. వీటితోపాటు వర్షపాతం హెచ్చుతగ్గులనుబట్టి అనుసరించదగిన ప్రత్యామ్నాయ ప్రణాళిక, పాడి పశువుల సంరక్ష ణకు తగిన ఏర్పాట్ల వంటివి కూడా ఎంతైనా అవసరం. వానలు ఆలస్యమైనా నష్టపోనిరీతిలో స్వల్పకాలికమైన, బెట్టను తట్టుకోగలిగిన పంటలను ఎంచుకోవడం మంచిది. ఎక్కువ నీరు అవసరమయ్యే, ఎక్కువ సమయంపట్టే వరి వంటి పంటలు కాకుండా, కొద్దిపాటి నీటితో, స్వల్ప కాలంలో కోతకు వచ్చే చిరు(సిరి) ధాన్యాలు, వేరుశనగ, యితర కాయ ధాన్యాలు, కంది వంటి పంటలు మేలు. వేరుశనగ–సజ్జ, మొక్కజొన్న–బెండ వంటి ఆంతర పంటల విధానం కూడా అవసరం. ఇక పొలాలలో తేమను సంరక్షించుకునే దిశగా, పంటకాల్వలలో, చెరువులలో పూడికలు తొలగించడంపైన కూడా దృష్టిపెట్టడం అవసరం. ఇటీవలి కాలంలో ప్రకృతి వ్యవసాయాన్ని గురించి బాగా వినపడుతున్నప్పటికి, ప్రచారంలో వున్నంతగా ఆచరణలో వుండడంలేదు. ఇప్పటికీ రసాయనిక వ్యవసాయనిదే సింహభాగం. అందువల్లనే యూరియా, డి ఏ పి వంటి రసాయనిక ఎరువులకు కొరత ఏర్పడితే రైతులోకం అంతగా గగ్గోలు పెడుతుంది. అసలే అమెరికా – ఇరాన్ యుద్ధం పర్యవసానంగా, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్‌తోపాటు రసాయనిక ఎరువులకు కూడా ఎంతో కొంత లోటు ఏర్పడే ప్రమాదం పొంచి వున్నది. ఈ కారణంగానైనా రైతులు ప్రకృతి వ్యవసాయంపైన, సేంద్రియ ఎరువుల వినియోగంపైన మరింత శ్రద్ధ వహించడం మంచిది. ప్రభుత్వాలు కూడా, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికి, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను గమనించి, యూరియా, డి ఏ పి, అంతగా హానికరంకాని రసాయనిక పురుగు మందులకు కొరత ఏర్పడకుండా ముందుగానే తగినన్ని నిల్వలు సమకూర్చుకోవడం అవసరం. వీటితోపాటు ప్రత్యామ్నాయ చిరుధాన్యాలు, కాయ ధాన్యాల వంటి స్వల్పకాలిక పంటల మేలురకం విత్తనాలు తగినంతగా అందుబాటులో వుండేలా ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి. సంప్రదాయ పంటలతో పాటు అవకాడో, కోకో వంటి అధిక ఆదాయం సమకూర్చే ప్రత్యామ్నాయ పంటలను కూడా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ ప్రోత్సాహాన్ని రైతులు అందిపుచ్చుకోవాలి. ఇలా అన్ని రకాల జాగ్రత్తలతో, ముందస్తు సంసిద్ధతతో మన తెలుగు రాష్ట్రాల రైతులు ఈ ఖరీఫ్ పంట కాలంలో నష్టాలబారిన పడకుండా, మంచి ఆదాయాన్ని ఆర్జిస్తారని ఆశిద్దాం



**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

**సాధించడం కష్టమనిపిస్తే మీ నైపుణ్యాన్ని పెంచుకోవాలి, లేకుంటే మీ కలను కుదించుకోవాలి**

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సాంకేతిక సహకారం: క్రిస్టోఫర్ వసంత్**


## లోపలి పేజీలలో ....


- ఆదర్శ రైతు సంస్థలుగా ఏపిమాస్ ఎఫ్ పి ఓ లు! 05
- పట్టణ పోషణ పథకంపై విప్రో బృందం క్షేత్ర స్థాయి సమీక్ష 06
- జాతీయ రహదారుల వెంట 'తెలుగుదనం' 07
- మాతా శిశు ఆరోగ్య సంరక్షణపై భాగస్వామ్య సదస్సు 09
- వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్‌గా తెలుగు వ్యక్తి 09
- రైతు సాధికారతపై ఎఫ్ పి ఓల ద్వారా శిక్షణ 10
- బంగారు కుటుంబాలతో శ్రీ సి ఎస్ రెడ్డి ముఖాముఖీ 12
- ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ముగ్గురు సి ఆర్ పిలకు అవార్డులు! 13
- ఏపిమాస్ ఆధ్వర్యంలో అనేక 'పోషణ పక్షం' కార్యక్రమాలు! 14
- ప్రకృతి వ్యవసాయం వరికి అభినందన, ఆదరణ 16
- పాలిచ్చే తల్లుల పోషణకు 'విప్రో' కిట్స్ ! 17
- నీటికోసం నిలిచి గెలిచిన జలసంరక్షకులు! 18
- అయ్యో పాపం మూగజీవాలు...! 21
- 'నూకల' దెబ్బకు కలుపు బలాదూర్ ! 22
- దేశీ కోళ్ల పెంపకం.. లాభదాయక వ్యాపారం 24
- తెలంగాణా పంచాయతీలకు జాతీయ అవార్డులు 25
- కుంకుమ పువ్వు పండిస్తున్నారు 26
- ఏపీలోనూ యాపిల్ పంట 28
- నారీ..సంపన్నకారి 29
- ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక 29
- ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక 30
- దోస, గుమ్మడి సాగుతో రెండు నెలల్లో రూ. 2 లక్షలు! 31
- హిందూ మహిళ వారసత్వ ఆస్తిపై భర్తకు హక్కు ఉండదు 32
- వర్షపు నీటి సంరక్షణలో భేష్..! 33
- మైక్రో ఇరిగేషన్‌లో ఏపీ నంబర్ వన్ 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
| --- | --- | --- |
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
| --- | --- |
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


**దురాశకంటె నిరాశ మరింత చెడ్డది ... అది మన సర్వశక్తులను కుంగదీస్తుంది**

# ఆదర్శ రైతు సంస్థలుగా ఏపిమాస్ ఎఫ్ పి ఓ లు !

– మహేష్ అలగప్ప




**కేం**ద్ర ప్రభుత్వ '10 వేల ఎఫ్ పి ఓల పథకం' కింద తెలంగాణాలో ఏపిమాస్ ప్రోత్సహిస్తున్న 14 ఎఫ్ పి ఓల ప్రతినిధులకు (పాలకవర్గం సభ్యులు, సిబ్బంది) రెండు రోజుల వర్క్‌షాప్ ను 2026 ఏప్రిల్ 13 ,14 తేదీలలో హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయం ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మందికి పైగా ఎఫ్ పి ఓ ప్రతినిధులు, ఏపిమాస్ తెలంగాణా బృందం పాల్గొన్నారు.

ఈ వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యం ఎఫ్ పి ఓల ప్రగతిని, సవాళ్ళను సమీక్షించడం, ఎఫ్ పి ఓల కోసం విజన్ – 2030 ను రూపొందించడం , 14 ఎఫ్ పి ఓల వ్యాపార ప్రణాళికలకు తుది రూపం ఇవ్వడం. ఎఫ్ పి ఓ ప్రతినిధుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సానుకూల దృక్పథాన్ని ప్రోత్సహించడం కూడా ఈ కార్యక్రమం యితర ముఖ్య ఆశయాలు.

నాబార్డ్ తెలంగాణ సి జి ఎం శ్రీ ఉదయ్ భాస్కర్ , ఏ జి ఎం శ్రీమతి అర్పిత , తెలంగాణ వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాస్ , ఏపిమాస్ సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి, కన్సల్టెంట్ శ్రీ మహేష్ అలగప్ప,కోరమండల్ ఇంటర్నేషనల్ , ఇఫ్ కో ప్రతినిధులు ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు.

ఎఫ్ పి ఓల ప్రతినిధులతో జరిపిన చర్చల్లో , ముఖ్యంగా ఎఫ్ పి ఓ లు బలమైన వ్యాపార సంస్థలుగా ఎదగాలి అనే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ దిశగా:

- ఎఫ్‌పీఓలు లాభదాయకమైన వ్యాపార సంస్థలుగా పనిచేయాలి
- స్థానిక పంటల నమూనాలను , సభ్యుల ఆశయాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలి
- బోర్డ్ సభ్యులు, సిబ్బంది , సభ్య రైతుల మధ్య సమన్వయం బలపడాలి

శ్రీ ఉదయ్ భాస్కర్ నాబార్డ్ ద్వారా లభించే సహాయ అవకాశాలను వివరించారు. శ్రీ శ్రీనివాస్ తెలంగాణ ప్రభుత్వం ఎఫ్ పి ఓల అభివృద్ధికి అందించే మద్దతును వివరించి, ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించడానికి అవసరమైన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వర్క్‌షాప్ ముగింపులో శ్రీ సి.ఎస్. రెడ్డి విజన్ –2030, వ్యాపార ప్రణాళికలను అమలులోకి తీసుకురావడం చాలా ముఖ్యమని గుర్తుచేశారు.ఏపిమాస్ తెలంగాణ బృందం 2026–27 సంవత్సరానికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, ఎఫ్‌పీఓలకు అవసరమైన సహాయాన్ని అందించనుంది.

**ప్రధాన లక్ష్యాలు , కార్యాచరణ**

- ప్రతి ఎఫ్ పి ఓ లో డిసెంబర్ 2026 నాటికి 750

# పట్టణ పోషణ పథకంపై విప్రో బృందం క్షేత్ర స్థాయి సమీక్ష

– భవాని

ఏపిమాస్ 'పట్టణ పోషణ పథకా'నికి సహకారం అందిస్తున్న 'విప్రో కేర్స్' సంస్థ నుంచి ఆకాంక్ష మాథుర్ గారు మెహదీపట్నం , కార్వాన్ ప్రాంతాలలోని పట్టణ పోషణ పథక బృందం పనిచేస్తున్న ప్రాంతాలను సందర్శించారు. అందులో భాగంగా ఇటీవల విస్తరించిన ప్రాజెక్ట్ ప్రాంతాలలో ఒకటైన కర్వాన్-2 అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించి, సహభాగస్వాములైన ఆరోగ్య, శిశుసంక్షేమ శాఖ అధికారులతో చర్చలు సాగించారు.



కార్వాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆశా కార్యకర్తలతో , మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి, కేంద్రంలో అందిస్తున్న ఆరోగ్య సేవల పరిధిని అర్థం చేసుకున్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సేవలు, టీకాలు, లబ్ధిదారుల సమీకరణ, ఆశా వర్కర్లకు ఏపిమాస్ అందిస్తున్న శిక్షణలు, సమాజ స్థాయి అవగాహన కార్యక్రమాలను బలోపేతం చేయడంలో ఏపిమాస్ సంస్థ పోషిస్తున్న సహాయక పాత్రపై చర్చించారు. తరువాత కర్వాన్-2 అంగన్‌వాడీ కేంద్రంలో, ఆమె స్వయం సహాయక సంఘ సభ్యులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులతో మాట్లాడారు. ఈ చర్చల్లో తల్లులకు మెరుగైన ఆరోగ్య, పోషణ , శిశు సంరక్షణ పద్ధతులను నేర్పించడం, అవలంబింపజేయడంలో ఆరోగ్య కార్యకర్త రమాదేవి ఎలా సహాయం చేస్తున్నారో వివరించబడింది. శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీమతి రేణుక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన చర్చలకు హాజరై, తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తరువాత, ఆకాంక్ష గారు ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డితో ప్రాజెక్ట్ పురోగతి , భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్ట్ పురోగతి , ప్రభావంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేసి, మెచ్చుకున్నారు.

ఈ సందర్శనకు ఏపిమాస్ డైరెక్టర్ డా. అరుణ, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి భవాని, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జాహ్నవి, తేజస్విని, హెల్త్ ఫెసిలిటేటర్ రమాదేవి , అంగన్‌వాడీ టీచర్ మంజుల సహకరించారు. ■

---

మంది కంటే ఎక్కువ షేర్‌హోల్డర్లు ఉండాలి

- 2027 మార్చి నాటికి ఈక్విటీ గ్రాంట్ , మేనేజ్‌మెంట్ గ్రాంట్ పూర్తిగా వినియోగించాలి
- 2026-27లో ప్రతి ఎఫ్ పి ఓ ₹100 లక్షలకుపైగా టర్నోవర్ సాధించాలి
- అన్ని ఎఫ్‌పీఓలు ఓ ఎన్ డి సి ప్లాట్‌ఫారమ్‌లో విక్రయాలు ప్రారంభించాలి
- బ్యాంక్ లింకేజీలను, మార్కెట్ లింకేజీలను , రుణ సౌకర్యాలను పెంపొందించాలి
- భూమి , ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ఇకపై ఏపిమాస్ తెలంగాణ ఎఫ్ పి ఓ ల పురోగతిని ప్రతి నెలా సమీక్షించాలనే నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం , నాబార్డ్ తో కలిసి ఎఫ్ పి ఓలచే కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతుల కోసం, పెండింగ్ నిధుల విడుదల కోసం ఏపిమాస్ కృషి చేస్తుంది.

చివరగా అందరూ, "ఏపిమాస్ ప్రోత్సహించిన ఎఫ్ పి ఓ లను తెలంగాణలో ఆదర్శ ఎఫ్ పి ఓ లుగా అభివృద్ధి చేసేందుకు మిషన్ మోడ్‌లో ముందుకు సాగుదాం' అనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ■

# అన్నదాతల ఆధ్వర్యంలో 'తెలుగుదనం' వికాసం!

ఇప్పటివరకు ప్రకృతి వ్యవసాయ ఉద్యమ సారథిగా, సేవ్ ' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకునిగా సుప్రసిద్ధులైన శ్రీ విజయరామ్ యిప్పుడు నానాటికీ దిగజారుతున్న తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడి, భవిష్యత్ తరాలకు ఆ తెలుగుదనం మాధుర్యాన్ని, తెలుగు వెలుగులను అందించాలనే మహదాశయంతో ముందడుగు వేస్తున్నారు. ఈ ఆశయ సాధనలో భాగంగా ఆయన ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ను కలుసుకుని, తన ఆశయాన్ని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రైతు సొసైటీలకు జాతీయ రహదారుల వెంట ఐదెకరాలు లీజుపై కేటాయించాలని, ఆ స్థలంలో తెలుగు పంటలు, తెలుగు వంటలు, తెలుగు కళారూపాల ప్రదర్శనలు, తెలుగు భాషా, సాహితీ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, తెలుగుదనానికి పునర్ వైభవం తీసుకు వద్దామని ప్రతిపాదించారు. ఈ కేంద్రాలకు 'తెలుగుదనం' అని పేరు పెడితే సముచితంగా వుంటుందని కూడా ఆయన సూచించారు. తెలుగుదనం వేదికలతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం సమీపంలోని తరకటూరు వ్యవసాయ క్షేత్రంలో పండించిన 35 రకాల ఉత్పత్తుల్ని చంద్రబాబుకు అందజేశారు.

ముఖ్యమంత్రి తమ వినతిని ఆసక్తిగా విన్నారని, తమ ప్రతిపాదనను, వినతి పత్రాన్ని పర్యాటక శాఖ పరిశీలనకు పంపుతామని చెప్పినట్టు శ్రీ విజయరామ్ వివరించారు. తమ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తానని కూడా సీఎం హామీ ఇచ్చారని విజయరామ్ తెలిపారు. ఆయనతోపాటు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయడును కలిసిన బృందంలో ఆయన సోదరుడు, అన్నిటా ఆయనకు చేదోడువాదోడుగా వుంటున్న శ్రీ సురేంద్రనాథ్ బెనర్జీ, అమెరికాను వదిలి వచ్చి తెలంగాణాలో క్రియాశీల ప్రకృతి వ్యవసాయ ఉద్యమకారిణిగా వున్న శ్రీమతి ఝాన్సీ లక్ష్మీబాయి, సస్యశ్యామలం వెబ్ పత్రిక నిర్వాహకులు శ్రీ కిరణ్ వున్నారు.

మనం మరిచిన ఎన్నో తెలుగు పంటలను, వంటలను తాము తమ వ్యవసాయ క్షేత్రాలలో గత 17 సంవత్సరాలుగా పండించి, వండించి ప్రోత్సహిస్తున్నామని, దానికి ఆదరణ నానాటికి పెరుగుతున్నదని శ్రీ విజయరామ్ పేర్కొన్నారు. "మన భూమి, మన పంట, మన వంటకు చేయూత ఇవ్వండి. అక్కడ 600 రకాల తెలుగు వంటకాలను పరిచయం చేస్తాం. అమ్మమ్మ, నానమ్మల చేతివంట రుచి చూపిస్తాం' అని విజయ్‌రామ్ ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతుబజార్, శిల్పారామాల ఏర్పాటుతో మన వ్యవసాయం, మన సంస్కృతికి చంద్రబాబు ఎంతో చేయూత అందించారని, అదే తరహాలో 'తెలుగుదనం' వేదికల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాల్ని అందిపుచ్చుకోవాలని తొలిసారి సూచించింది చంద్రబాబే అని పేర్కొన్నారు.

**విశాఖలో మన వంటకు విశేష ఆదరణ**

"విశాఖపట్నంలో రెండేళ్లపాటు 'భోజన పండగ' నిర్వహించి వివిధ రకాల వంటకాలను పరిచయం చేశాం. దీనికి విశేష స్పందన వచ్చింది. ఏప్రిల్ 1 నుంచి 5 వరకు 'సబల' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి 50 వేల మంది వచ్చారు. మన వంటల్ని ప్రజలు కోరుకుంటున్నారనేందుకు ఇదే నిదర్శనం" అని విజయ్‌రామ్ తెలిపారు. 'తెలుగుదనం' వేదికల ప్రణాళికలను వివరిస్తూ.. తెలుగువారికే ప్రత్యేకమైన సుమారు 600 వంటకాల తయారీని ఆ వేదికలపై నేర్పిస్తామన్నారు. 'ఏ కాలంలో ఏం తినాలో తెలియజేస్తాం. మిఠాయిలు, పచ్చళ్లు, ఎద్దు గానుగ నూనెల తయారీ, మట్టి బొమ్మలు, కుండలు చేయడం, బుట్టలు, తాటి మంచాల అల్లికపై శిక్షణ ఇస్తాం. జానపదాలు, తెలుగు పద్యాలు, మహనీయుల వీరగాథలు తెలుసుకునేలా వేదికలు తీర్చిదిద్దుతాం. గో ఆధారిత వ్యవసాయంపై నిరంతర శిక్షణ, వాన నీటి సంరక్షణ, దేశీయ విత్తన నిధి, దేశవాళీ ఆవుల పెంపకం, పాడి పరిశ్రమ నమూనాల్ని తెలియజేస్తాం' అని తెలిపారు.

ఇంతే కాకుండా, 'జిల్లా పరిధిలో నిర్వహించే ముఖ్య కార్యక్రమాలన్నీ ఆ వేదికలపైనే చేసుకునేలా ఏర్పాట్లు చేస్తాం. పెళ్లి చూపులు, పర్యావరణహిత వివాహాలు, సీమంతాలు, ఉయ్యాల పండగలు, పుట్టినరోజు వేడుకలు, పదవీ విరమణ వేడుకలూ చేసుకోవచ్చు. ప్రతి జిల్లాలో వేదికను ఐఏఎస్

అధికారి పర్యవేక్షించేలా చూడాలి' అని విజయ్‌రామ్ వివరించారు.

**ప్రభుత్వానికి ఆదాయం**

ప్రకృతి వ్యవసాయ రైతులకు ఈ సహకారం అందించడం వల్ల ఒక జిల్లా ద్వారా ప్రభుత్వానికి 20 నుండి 30 లక్షల ఆదాయం సమకూరుతుంది. ప్రజా శ్రేయస్సు కోసం ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు చేసిన మీరు, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ రైతులకు, వినియోగదారులకు ఒక వారధిగా ఈ వేదిక ఏర్పాటు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇంకా శ్రీ విజయరామ్ తమ వినతి పత్రంలో ఈ అంశాలను ప్రతిపాదించారు.

'భారతదేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటి వరకు సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాన్ని, అధికారికంగా నిర్వహించలేదు. మీరు మాత్రమే, భూమి ఆరోగ్యం, పర్యావరణం, సహజ వనరులు, సమాజ ఆరోగ్యాన్ని ఎంతో దూర దృష్టితో గమనించి పది సంవత్సరాల క్రితమే దీనికి శ్రీకారం చుట్టారు.

22 సంవత్సరాల క్రితమే శిల్పారామం ద్వారా మన సంస్కృతి కళలు, భవిష్యత్తు తరాలకు దగ్గర చేశారు. రైతుల కోసం 22 సంవత్సరాల క్రితమే రైతు బజార్లకు శ్రీకారం చుట్టారు.

స్వర్గీయ ఎన్టీఆర్ గారు 44 సంవత్సరాల క్రితం తెలుగు జాతిని ఒక్కటి చేసి జాతీయ స్థాయిలో తెలుగు కీర్తిని హస్తినలో నిలబెట్టారు. తెలుగు భాష, తెలుగు వంటలు మాయమైపోతున్నాయి.

మన భూమి, మన పంటలు, మన వంటలు, మన చేతి వృత్తులు, మన సంస్కృతి ఒకే వేదిక మీద గో ఆధారిత రైతులు, చేతి వృత్తుల కళాకారులను వచ్చిన అతిథులకు పరిచయం చేయడం జరుగుతుంది. ఇక్కడ రైతులే వక్తలు, పండించే వారు ఎవరు అని వినియోగదారులకు పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశ్యం. ఇది గో ఆధారిత రైతులందరూ కలిసి చేసుకున్న వేడుకలు. గతంలో పదివేల మంది ఈ భోజన పండుగలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం 2026 ఏప్రిల్ 1 నుండి 5 వరకు జరిగిన వేడుకలో 50 వేల మంది పాల్గొన్నారు. మేము చేసిన ఈ వేడుక తాత్కాలికమైన వేదిక, ఈ అంశాలపై జనం కోరుకుంటున్నారనటానికి నిలువెత్తు నిదర్శనం, గ్రామం డబ్బు గ్రామంలో ఉండాలని, పట్టణాల డబ్బు గ్రామాలకు రావాలని మీరు ఎన్నో సంవత్సరాల క్రితమే పాలేకర్ సిద్ధాంతాన్ని సమాజానికి అందించారు.

తెలుగుదనం, తెలుగు వంటలను విష రసాయనాలు లేకుండా, జాతీయ రహదారుల ప్రక్కన 5 ఎకరాల భూమి ప్రతి జిల్లాలో, గో ఆధారిత రైతులకు లీజు ప్రాతిపదికన ఇస్తే, ఆ జిల్లా రైతులు సమిష్టి కృషితో వాణిజ్యము, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతి, స్థానిక రైతులు, పదవీ విరమణ చేసిన తెలుగు భాషా పండితులు, ఆధ్యాత్మిక గురువులద్వారా సంస్కారాలు నిర్వహించబడతాయి.

**జాతీయ రహదారుల ప్రక్కన ఎందుకు?**

భారత దేశం మొత్తంలో జాతీయ రహదారుల ప్రక్కన ఏ రాష్ట్రంలో వాళ్ళ ఆహార సంస్కృతి, వాళ్ళ వంటలు, వంటలు తెలియజేస్తూ వాటిని ప్రతిబింబిస్తూ ఎక్కడా నిర్మాణం జరగలేదు.

మీరు తెలుగు రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక చక్కని తెలుగు పేరుతో ఆహార జ్ఞానం అందించే ఒక వేదిక కావాలని, రహదారుల మీద ప్రయాణం, చేసే వారికీ తెలుగు వంటల రుచి చూపించడంతో పాటు, ఆ వేదిక ఆ జిల్లా రైతుల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకానికి వేదిక ఉంటే స్వయం ఆధారితంగా రైతులు నిలబడతారు.

ఈ నమూనా 26 జిల్లాలలో ఒకే తరహాలో ఒకే రూపంతో గుర్తించడానికి బాగుంటుంది. ఈ వేదికకు తెలుగుదనం (మన భూమి, మన పంట, మన వంట) అనే పేరును పరిశీలించగలరు.

ఈ వేదిక నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం తరఫున ప్రతి జిల్లాకు ఒక ఐఏఎస్ అధికారి పర్యవేక్షణలో ఉండేలా చూడగలరు.

ఆ జిల్లా నుండి, ఆ వేదిక నుండి జరిగే కార్యక్రమాలు, పెళ్ళి చూపులు, పర్యావరణహిత వివాహాలు, గర్భ సంస్కారాలు, శ్రీమంతాలు, ఉయ్యాల పండుగలు, బోర్లా పడితే బొబ్బట్లు, అడుగుల్లో అరిసెలు, పుట్టినరోజు వేడుకలు, అక్షరాభ్యాసాలు, ఉపనయనాలు , పదవీ విరమణ వేడుకలు ఇతర శుభకార్యాలు, కుమ్మరి కుండలు, నేతన్న చెరకాలు, మేదరి బుట్టలు, తాటి మంచాలు, తాటి చాపలు, బుట్టలు, జానపదాలు, తెలుగు

(మిగతా 32 వ పేజీలో)

**ఓడినా మళ్ళీ గెలవవచ్చు , కానీ సాకులు వెదకడం మొదలెట్టావా ఇక శాశ్వత ఓటమే**

# మాతా శిశు ఆరోగ్య సంరక్షణపై భాగస్వామ్య సదస్సు

- జాహ్నవి

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం ఆధ్వర్యంలో ఏప్రిల్ 1వ తేదీన 'భాగస్వాముల సంప్రదింపుల సమావేశం, పోషణ పఖ్వాడా ప్రారంభోత్సవ' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రతినిధులు, నిపుణులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు , అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కేవలం ఒక సమావేశం మాత్రమే కాదు తల్లి , శిశు ఆరోగ్యంపై మార్పును తీసుకురావాలనే సంకల్పానికి నాంది. అలాగే రాబోయే పోషణ పక్షంలో ఏమేమి కార్యక్రమాలు చేపట్టొచ్చు అని ఒక ప్రణాళిక వేయడం కూడా ఒక ఉద్దేశ్యం.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి , డైరెక్టర్ డా. అరుణ , తెలంగాణా ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీమతి రేణుక , పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీ భరత్, గోల్కొండ సీనియర్ వైద్య అధికారి డా. మురళీధర్ కార్వాన్ వైద్య అధికారి డా. శ్రీకాంత్, గృహ విజ్ఞాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జానకి, ఉపాధ్యాయురాలు చారులత గారు, రిసోర్స్ పర్సన్ రాజేశ్వరి, గారు , యుసిడి ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు , ఆశాలు, హాజరుయ్యారు.

వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ఎంత ముఖ్యమో సమావేశంలో చర్చించారు. మాతా శిశు ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను లోతుగా చర్చించారు. ముఖ్యంగా, గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడం, పిల్లల్లో పోషకాహార లోపం , కొన్ని ప్రాంతాల్లో సేవల అందుబాటు సమస్యలు మొదలైన అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.

శ్రీ సి ఎస్ రెడ్డి కుటుంబాల్లో ఆదాయం ఉన్నప్పటికీ, ఆరోగ్యం , పోషకాహారంపై సమయం కేటాయించడం తగ్గుతుండడంపట్ల ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయంలో అధికంగా పురుగుమందుల వినియోగం ఆహార భద్రతపై ప్రభావం చూపుతోందని కూడా ఆయన ప్రస్తావించారు. ఆరోగ్య ఫలితాలు మారాలంటే జీవనశైలి మారి తీరాలని ఆయన స్పష్టం చేశారు.

గత మూడు నెలల్లో గర్భిణుల నమోదు మెరుగుపడిందని, అన్ని ఎ.ఎన్.సి కేసులు ఆశా కార్యకర్తల పర్యవేక్షణలో ఉన్నాయని డా. మురళీధర్ తెలిపారు. మాతృ మరణాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ, ఇంకా కృషి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో క్షేత్ర స్థాయి కార్యకర్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. గ్రామాల్లో , పట్టణ ప్రాంతాల్లో ఎదురయ్యే సవాళ్ళను వారు వివరించారు. విద్యావంతులలో కూడా పోషణపై అవగాహన లోపం ఉందని, కుటుంబ సభ్యులందరూ ప్రత్యేకంగా భర్త , కుటుంబ పెద్దలు గర్భిణుల సంరక్షణలో భాగస్వాములు కావాలని డా. జానకి సూచించారు.

పిల్లలు అల్పాహారం మానేస్తున్నారని పాఠశాల ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. రక్తహీనత, స్టంటింగ్ , పోషకాహార లోపం వంటి సమస్యలు మహిళలలో, బాలికలలో ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పోషణ అభియాన్ ద్వారా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, గర్భధారణ దశ నుంచే సరైన పోషణపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచించారు.

తల్లుల సమావేశాలను తరచుగా నిర్వహించడం, అంగన్వాడి కేంద్రాలను సమూహాలుగా కలిపి కార్యక్రమాలు నిర్వహించడం, కిశోర బాలికల భాగస్వామ్యాన్ని పెంచడం, సామాజిక సంస్థలతోడ్పాటును పొందడం అవసరమన్న సూచనలు వచ్చాయి. పోషణను వ్యక్తిగత అంశంగా కాకుండా కుటుంబస్థాయి బాధ్యతగా చూడాలని. శాఖల మధ్య సమన్వయం మరింత పెరగాలని, ముఖ్యంగా ప్రవర్తనలో మార్పుపై ఈ ప్రయత్నాలు దృష్టి కేంద్రీకరించాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. ■

# రైతు సాధికారతపై ఎఫ్ పి ఓల ద్వారా శిక్షణ

– జి. శ్రీనివాస్

గ్రామీణ భారతదేశంలో రైతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం సమూహాధారిత సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు) చిన్న , సన్నకారు రైతులను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి, వారికి మార్కెట్ అవకాశాలను, ఆర్థిక సేవలను, వ్యాపార నైపుణ్యాలను అందిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో, నంద్యాల జిల్లాలో 'సబల్ ప్రాజెక్ట్' ద్వారా 2026 ఏప్రిల్ 16 నుండి 18 వరకు నిర్వహించిన



ఎఫ్ పి ఓల పరిపాలన ,నిర్వహణ పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం రైతుల సాధికారతకు ఒక ఆశావహ ప్రయత్నంగా నిలిచింది. ఈ శిక్షణ ద్వారా పాలకవర్గ సభ్యులు, సిబ్బంది , సభ్య రైతులు ఎఫ్ పి ఓల పరిపాలన, నిర్వహణ, చట్టపరమైన అంశాలు , వ్యాపార అభివృద్ధిపై తగిన అవగాహన పొందారు. ఈ శిక్షణను ఏపి మాస్ సంస్థకుచెందిన శ్రీ మురళి జాజున , శ్రీ జి. శ్రీనివాస్ నిర్వహించారు. శిక్షణలో ఎనిమిది రైతు ఉత్పత్తిదారుల సంస్థల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది మొత్తం 28 మంది పాల్గొన్నారు. మూడు రోజులపాటు వివిధ అంశాలపై అనుభవాలను పంచుకోవటం, అభ్యాస, సహభాగ పద్ధతిలో సెషన్లు నిర్వహించబడ్డాయి.

**శిక్షణ ఉద్దేశం :** ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఎఫ్ పి ఓలను బలోపేతం చేయడం, పాలన వ్యవస్థలను మెరుగుపరచడం , సభ్యులను స్వయం సమర్థులుగా తయారు చేయడం.

**మొదటి రోజు:** పాల్గొనేవారి పరిచయాలతో మొదటి రోజు శిక్షణ ప్రారంభమైంది. ప్రతి సభ్యుడు తన అనుభవాన్ని పంచుకోవడం ద్వారా ఒక ఆసక్తికరమైన వాతావరణం ఏర్పడింది. తర్వాత ఎఫ్ పి ఓ అంటే ఏమిటి, అది ఎందుకు అవసరం అనే అంశాలపై చర్చ జరిగింది. చిన్న రైతులు ఎదుర్కొనే తక్కువ ధరలు, మార్కెట్ లోపం, వనరుల కొరత వంటి సమస్యలను సమూహంగా పని చేయడం ద్వారా ఎలా అధిగమించవచ్చునో వివరించారు. చిన్న గ్రూప్ చర్చల ద్వారా సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పోస్టర్లు, కథలు, ప్రదర్శనల ద్వారా శిక్షణను సులభంగా అర్థమయ్యేలా చేశారు. అలాగే సభ్యులు, సిబ్బంది, పాలకవర్గం మధ్య సంబంధం, సమన్వయం ఎంత ముఖ్యమో రోల్ ప్లే ద్వారా వివరించారు. మహాసభ అధికారాలు, పాలకవర్గ సభ్యుల బాధ్యతలు, సిబ్బంది పాత్రలు, వంటి అంశాలను ఆటలు, చార్టుల ద్వారా వివరించారు.

**రెండవ రోజు :** రెండవ రోజు మొదటి రోజు నేర్చుకున్న అంశాలపై సమీక్షతో ప్రారంభమైంది. ఈ రోజు ప్రధానంగా ఎఫ్ పి ఓ లో పాటించవలసిన వ్యవస్థలు, పాలకవర్గ నిర్మాణం, ఎన్నికల విధానం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. పాలకవర్గ సభ్యుల అర్హతలు, పదవీకాలం, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలను ప్రదర్శన , రోల్ ప్లే ద్వారా వివరించారు. సమావేశాల నిర్వహణపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఇందులో ముఖ్యంగా నోటీసు ఇవ్వడం, కోరం నిర్ధారించడం, అజెండా సిద్ధం చేయడం , సమావేశంలో అన్ని విషయాలు చర్చించటం, నిర్ణయాలు తీసుకోవడం. వార్షిక మహాసభ (ఏ జి ఎం) నిర్వహణలో చేయవలసిన చర్యలను కూడా వివరించారు. వార్షిక మహాసభ కంటే ముందు చేయాల్సినవి, మహాసభలో చేయాల్సినవి, మహాసభ అనంతరం చేయాల్సిన పనులు, మహాసభ నిర్వహణ విధానం గురించి వివరించారు. రెండవ రోజు శిక్షణలో సభ్యులు బాధ్యతాయుతమైన నాయకత్వంపై అవగాహన పొందారు.

**మూడవ రోజు** : మూడవ రోజు శిక్షణలో ముఖ్యంగా ఉత్తమ పరిపాలనా పద్ధతులు, వ్యవస్థల నిర్వహణపై చర్చ జరిగింది. చట్టపరమైన నిబంధనలు , లైసెన్సులు: ఎఫ్ పి

ఓ లో పాటించవలసిన చట్టపరమైన నిబంధనలు , అవసరమైన లైసెన్సులు , పర్మిట్లపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఈ అంశాలను చార్టుల ద్వారా వివరించడం జరిగింది. ఈ సెషన్ ద్వారా చట్టపరమైన అవగాహన పెరిగింది, పారదర్శకత ప్రాముఖ్యత తెలిసింది, సంస్థ తన నమ్మకాన్ని పెంచుకోవడం ఎలా అనే విషయాన్ని వారు అర్థంచేసుకున్నారు. ఎఫ్ పి ఓ కార్యాలయం నిర్వహణపై కూడా చర్చ జరిగింది. రికార్డుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, స్టాక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలను వివరించారు.

**కార్యాచరణ ,వ్యూహాలు:** మూడవ రోజు పాల్గొన్నవారిని ఎఫ్ పి ఓ వారీగా విభజించి, ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 2026 వరకు ఆరు నెలల కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) రూపొందించారు. ఈ ప్రణాళికలో: కార్యకలాపాలు, సమయం, బాధ్యతలు, అవసరమైన మద్దతు వంటి అంశాలు వుంటాయి. ఇది సభ్యుల్లో ప్రణాళికా దృష్టిని పెంపొందిస్తుంది. ఇంతే కాకుండా, ఎఫ్ పి ఓ వారీగా వ్యూహాత్మక ప్రణాళికను కూడా చేపట్టడం జరిగింది.

**మార్కెటింగ్ ,వ్యాపార అవగాహన:** మూడవ రోజు చివరి సెషన్‌లో మార్కెటింగ్ ,వ్యాపార అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. మక్క జొన్న ఉదాహరణ ద్వారా ఉత్పత్తి నుండి విక్రయం వరకు దశలు, సరైన ధర నిర్ణయం, విలువ వృద్ధి అవకాశాలపై వివరించడం సభ్యులు వ్యాపార దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవడానికి దోహదం చేసింది.

ఈ శిక్షణ ద్వారా ముఖ్యంగా పరిపాలన,నిర్వహణలో భాగంగా పాలకవర్గ సభ్యులలో నాయకత్వ నైపుణ్యాలు, వ్యవస్థాబద్ధమైన పని విధానం, చట్టపరమైన అవగాహనపై స్పష్టత వచ్చింది. శిక్షణ కార్యక్రమం రైతుల సాధికారతపై గణనీయమైన ప్రభావాన్ని చూపించింది. ముఖ్యంగా, సభ్యులలో ఆర్థిక స్థిరత్వం పట్ల అవగాహన పెరిగి, ఆదాయాన్ని మెరుగుపరచుకునే మార్గాలపై స్పష్టత ఏర్పడింది.సంస్థ కార్యకలాపాలలో సభ్యుల భాగస్వామ్యం పెరగడంతో, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారి పాత్ర మరింత బలపడింది. ఈ శిక్షణ ద్వారా ఎఫ్ పి ఓలపట్ల సభ్యులకు నమ్మకం గణనీయంగా పెరిగి, సంస్థతో మరింత అనుబంధం ఏర్పడింది. అంతేకాకుండా, వ్యక్తిగతంగా కాకుండా సమూహంగా ఎదగాలనే భావన బలపడి, ఒకరికొకరు సహకరించుకుంటూ అభివృద్ధి సాధించాలనే దృక్పథం స్పష్టంగా కనిపించింది.

**భవిష్యత్ దిశ:** ఈ శిక్షణ అనంతరం ఎఫ్ పి ఓలు మరింత బలోపేతం కావడానికి స్పష్టమైన భవిష్యత్ దిశానిర్దేశ అవసరం ఉంది. ముఖ్యంగా, సభ్యుల నైపుణ్యాలను, అవగాహనను నిరంతరం పెంపొందించేందుకు మరికొన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరం. అలాగే, రైతుల ఉత్పత్తులకు సరైన ధర లభించేలా మార్కెట్ లింకేజెస్‌ను విస్తరించాలి. ఆధునిక వ్యవసాయ పద్ధతులు , సంస్థ నిర్వహణలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచడం ద్వారా సమర్థతను మెరుగుపరచవచ్చు. అంతేకాకుండా, సభ్యుల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ద్వారా వారు సంస్థ అభివృద్ధిలో మరింత చురుకైన పాత్ర పోషించేలా చేయాలి.



ఈ మూడు రోజుల శిక్షణ రైతుల సాధికారతకు ఒక బలమైన పునాది వేసింది. సమూహంగా పనిచేసే రైతులు మాత్రమే భవిష్యత్తులో స్థిరమైన అభివృద్ధి సాధించగలరు. ఎఫ్ పి ఓల ద్వారా రైతులు కేవలం ఉత్పత్తిదారులుగానే కాకుండా, వ్యాపారవేత్తలుగా మారుతున్నారు. ఈ మార్పు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంచేస్తూ, సమగ్ర అభివృద్ధికి దారితీస్తుంది. మొత్తంగా ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఎఫ్ పి ఓ సభ్యులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. వారు సంస్థ నిర్వహణ, వ్యాపార అభివృద్ధి, చట్టపరమైన అవగాహన మరియు మార్కెటింగ్ నైపుణ్యాలలో గణనీయమైన పురోగతి సాధించారు.

శిక్షణలో పాల్గొన్నవారు మాట్లాడుతూ ఇంత చక్కని శిక్షణ ఏర్పాటు చేసిన సబల్ ప్రాజెక్ట్ వారికి, శిక్షణ ఇచ్చిన ఏపిమాస్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ■

విసుగుకు విరుగుడు ఆసక్తి ... ఆ ఆసక్తివుంటే అన్ని శక్తులు వున్నట్టే

# బంగారు కుటుంబాలతో శ్రీ సి ఎస్ రెడ్డి ముఖాముఖీ

– కరి శ్రీనివాస్

ఏపిమాస్ సి ఇ ఓ , ఎం డి శ్రీ సి.ఎస్. రెడ్డి 2026 ఏప్రిల్ 23న గుడ్లవల్లేరు మండలంలోని పి4 ప్రాజెక్ట్ ను సందర్శించారు. ఈ సందర్శన ప్రధాన ఉద్దేశం ప్రాజెక్ట్ లో అమలవుతున్న జీవనోపాధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించడం, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడడం, ప్రాజెక్ట్ అమలు తీరును మరింత బలోపేతం చేయడం. ఈ సందర్భంగా ఆయన బంగారు కుటుంబాలు (బి కె లు), బంగారు మిత్రలు (బి ఎం లు), టి ఓ టి / ఎం ఓ టి లతో సమావేశమై వారి అనుభవాలు తెలుసుకుని, భవిష్యత్ చర్యలపై మార్గదర్శకాలు అందించారు.

ముందుగా, ప్రాజెక్ట్ ద్వారా లబ్ది పొందిన బంగారు కుటుంబాల గృహాలను సందర్శించి లబ్ధిదారులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి అందిన సహాయంతో వారు చేపట్టిన జీవనోపాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సందర్శించిన 6 కుటుంబాలవారు వివిధ జీవనోపాధులు – టిఫెన్ సెంటర్, చికెన్ షాప్, చేపల వలలు , విక్రయ యూనిట్, సోడా బండి, గొర్రెల పెంపకం, బడ్డీ కొట్టు, కొబ్బరి బొండాల బండి వంటి వ్యాపారాలను మొదలు పెట్టారు. వారి వ్యాపార పరిస్థితి, మొదట్లో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్తున్నారు, రోజు వారీ ఖర్చు – ఆదాయ వివరాలు ఎలా వ్రాసుకుంటున్నారు మొదలైన వివరాలను వారితో చర్చించారు.

తరువాత డోకిపర్రు లోని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను సందర్శించి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీ జిలాని తో అక్కడ జరుగుతున్న శిక్షణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత గుడ్లవల్లేరు మండల కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి శ్రీ మహమ్మద్ ఇమ్రాన్ ను కలుసుకుని, మండలంలో ఎంఇఐఎల్ , ఏపిమాస్ సంస్థల భాగస్వామ్యంలో




అమలు అవుతున్న పి4 ప్రాజెక్ట్ కార్యక్రమాల తీరుతెన్నుల గురించి చర్చించారు.

తదనంతరం మండల కార్యాలయంలో జరుగుతున్న బంగారు కుటుంబాల ప్రీ–గ్రౌండింగ్ సమావేశం లో పాల్గొన్నారు. గుడ్లవల్లేరు మండలంలోన అమలు అవుతున్న పి4 ప్రాజెక్ట్ కార్యక్రమాల గురించి ఈ సమావేశంలో ఆయన వివరించారు. సమావేశంలో ఎం పి డి ఓ శ్రీ మహమ్మద్ ఇమ్రాన్, డి ఆర్ డి ఏ–సెర్ప్–ఏ పి ఎం శ్రీ పాండురంగ ప్రసాద్, శ్రీ మణికంఠ రావు , ఎస్ డి సి (ఎం ఇ ఐ ఎల్) యంగ్ ప్రొఫెషనల్ శ్రీ జిలాని , ఏపిమాస్ వాష్ ప్రాజెక్ట్ పి ఎం శ్రీ కరి శ్రీనివాస్ తదితరులు ఈ ప్రాజెక్ట్ ను విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు బంగారు కుటుంబ సభ్యులకు, బంగారు మిత్రులకు ,సచివాలయ సిబ్బంది కి కొన్ని సూచనలు చేశారు.

చివరలో కొందరు బంగారు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రాజెక్ట్ ప్రారంభించిన ప్రభుత్వానికి, అందులో తమతో పాటు భాగస్వామ్యులైన ఎంఇఐఎల్ , ఏపిమాస్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశాన్ని ఏపిమాస్ – పి4 ప్రాజెక్ట్ సిబ్బంది శ్రీ చింతయ్య, శ్రీ రఘురామ్ , శ్రీ జితేంద్ర ప్రసాద్ నిర్వహించారు. ■

నీలోనూ, నీకు అందుబాటులో ఎంతో శక్తి దాగుంది , దానిని గుర్తించడమే కార్యసాధనకు తొలిమెట్టు

# ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ముగ్గురు సి ఆర్ పిలకు అవార్డులు!

– జి ఆర్ అమరేంద్రుడు



రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా, ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లి ప్రాంతం, టమాటా సాగుకు ప్రసిద్ధి. అయితే, భూగర్భ జలాలు పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు, కూలీల కొరత , పెరిగిన పెట్టుబడి వ్యయం వంటి సవాళ్లతో ఇక్కడి వ్యవసాయం సంక్షోభంలో పడింది. ఈ పరిస్థితుల్లో ఏపిమాస్ సంస్థ, 'అజీం ప్రేమ్ జీ ఫౌండేషన్' సహకారంతో మదనపల్లి, కురబలకోట మండలాల్లో గత రెండు సంవత్సరాలుగా "రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్" ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేస్తోంది.

**క్షేత్రస్థాయిలో మార్పుకు చోదకశక్తులు**

ఈ ప్రాజెక్టు విజయానికి కీలకం గ్రామ స్థాయిలో నియమించబడిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సి ఆర్ పిలు). వ్యవసాయ ఖర్చును 30% తగ్గించి, 60% భూమిని ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో వీరు రైతులను చైతన్యవంతం చేస్తున్నారు.

**సి ఆర్ పిలు పోషిస్తున్న పాత్ర**

- నీరు , పంట భద్రతపై అవగాహన కల్పించడం.
- రసాయనరహిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడం.
- గ్రామ స్థాయిలో రైతులతో సమన్వయం సాధించి, కొత్త వ్యవసాయ నమూనాలను అమలు చేయడం.

**ఉత్తమ కమ్యూనిటీ ట్రాన్స్‌ఫార్మర్ అవార్డు**



గత ఖరీఫ్ కాలంలో సి ఆర్ పిలు నిర్వహించిన కార్యక్రమాల ప్రగతిని బట్టి, వారి నిబద్ధత , సామర్థ్యం ఆధారంగా ఉత్తమ సి ఆర్ పిలను ఎంపిక చేసి 'ఉత్తమ కమ్యూనిటీ ట్రాన్స్‌ఫార్మర్ అవార్డు'లను ప్రదానం చేశారు.

విజేతలు:

1. మొదటి ఉత్తమ సి ఆర్ పి: కవిత, గొల్లపల్లి
2. రెండవ సి ఆర్ పి: కె. గుర్రప్ప , మండెంవారిపల్లి
3. మూడవ ఉత్తమ సి ఆర్ పి: బి. నాగరత్నమ్మ, దుబ్బిగానిపల్లి

వీరు తమకు నిర్దేశించిన గ్రామాల్లో వ్యవసాయ విధానంలో మార్పుకోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం. రైతుల పెట్టుబడిని తగ్గించి, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తిని పెంచుతూ, బీడు భూములను సాగులోకి తీసుకురావడంలో వీరి పాత్ర మరువలేనిది.

రాయలసీమ రైతులకు కొత్త ఆశలను చిగురింపజేస్తూ, సుస్థిర వ్యవసాయం దిశగా సాగుతున్న ఈ ప్రయాణం మహిళా సాధికారతకు , సామాజిక మార్పుకు ఒక చక్కని ఉదాహరణ. ■

# ఏపిమాస్ ఆధ్వర్యంలో అనేక 'పోషణ పక్షం' కార్యక్రమాలు!

– తేజస్విని

పోషణ పక్షం అనేది భారతదేశంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఒక ముఖ్యమైన పోషకాహార అవగాహన కార్యక్రమం. 'పోషణ అభియాన్' (జాతీయ పోషణ మిషన్)లో భాగంగా ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా మాతాశిశు ఆరోగ్యం, సమతుల్య ఆహారం , పోషకాహార లోపాల నివారణపై దృష్టి పెడతారు.

ఈ సంవత్సరం 'పోషణ పక్షం' కార్యక్రమం ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు నిర్వహించబడింది. ఈ సంవత్సరపు కార్యాచరణ ఆశయం ' పిల్లల మొదటి 6 సంవత్సరాల్లో మెదడు గరిష్టంగా అభివృద్ధి చెందేలా కృషిచేయడం'. ఇంతే కాకుండా, జీవితంలోని తొలి 1000 రోజులకు ప్రాధాన్యం యిస్తూ, శిశువు గ్రహణ శక్తిని పెంచడానికి సరైన పోషకాహారం అందించాలన్నది కూడా 'పోషణ పక్షం మరో ఆశయం.



ఏపిమాస్ 'పట్టణ పోషణ పథక బృందం' వారు మెహదీపట్నంలో, కార్వాన్లో 'పోషణ పక్షం' సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వీటిలో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, వారి కుటుంబ సభ్యులతో పోషకాహారం గురించి చర్చలు, పాఠశాల విద్యార్థులతో పోషణ ర్యాలీలు, స్థానిక ఆహార పదార్థాలతో వంట ప్రదర్శనలు, సామూహిక అన్నప్రాశన కార్యక్రమాలు , ధాత్రి తల్లి పాల నిధికి సందర్శన వంటి విభిన్న కార్యకలాపాలను ఏపిమాస్ నిర్వహించింది.

జాఫర్గూడలో 20 మంది గర్భిణీ స్త్రీలు మరియు వారి కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గర్భధారణ సమయంలో ఉండే అపోహలపై గర్భిణీలు మరియు వారి అత్తల మధ్య చర్చలు జరిపి, అపోహలను తొలగించి సరైన సమాచారాన్ని ప్రాజెక్టు అధికారి మరియు ఆఫీసర్లు అందించారు.

శ్రీరాంనగర్లో 15 మంది గర్భిణీలు మరియు బాలింతలతో తొలి 1000 రోజుల్లో పాటించాల్సిన ఆరోగ్య మరియు పోషణ ఆచరణలు, వాటి ద్వారా బిడ్డ మెదడు అభివృద్ధికి కలిగే ప్రయోజనాలను వివరించారు.

అంబేద్కర్ నగర్లో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమాజంలో పోషణ మరియు ఆరోగ్యపరమైన మార్పు తీసుకురావడంలో వారి పాత్రపై ప్రాజెక్టు మానేజర్ చర్చించారు.

పానిపురాలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం అయిన తల్లులతో ఆహార నియమాలు మరియు శిశవుకు సరైన పాలిచ్చే భంగిమల గురించి అవగాహన కల్పించారు.

దేవల్జామ్ సింగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులతో పోషణ ర్యాలీ ప్రాజెక్టు నిర్వహించగా, "సరైన పోషణ – ప్రతి కుటుంబ హక్కు", "చిరుతిండ్లు మానేద్దాం" వంటి నినాదాలతో విద్యార్థులు



"న్యూ మదర్ కేర్ కిట్లు" పంపిణీ చేసి, మాతాశిశు సంరక్షణకు మద్దతు అందించారు.

పోషణ పక్షం ముగింపు కార్యక్రమంగా భోజగుట్టలోని స్వయం సహాయక సంఘాలతో ఆరోగ్యం , పోషణ గురించి ప్రతి నెల సంఘ సభ్యులు చర్చించాలని కోరారు.

శ్రీరామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో, 0-3 నెలల వయస్సు గల పిల్లలున్న బాలింత తల్లులతో పాటు అంగన్‌వాడీ టీచర్లతో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీరామ్‌నగర్ 1,2, శివాజీనగర్ 1,2, వివేకానంద నగర్, భోజగుట్ట, అంబేద్కర్ నగర్ , హిల్ కాలనీలకు చెందిన తల్లులు పాల్గొన్నారు. ఈ కేంద్రాలన్నిటి నుండి సుమారు 15 మంది తల్లులు , అంగన్‌వాడీ టీచర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో బిడ్డలకు తల్లిపాలు ఇచ్చే విధానాలపై తల్లులకు , తల్లి పాల ప్రయోజనాలు, పాలిచ్చే తల్లుల ఆహారం, ప్రసవం తర్వాత 6 నెలల పాటు ఐరన్ మరియు కాల్షియం మాత్రల వాడకంపై సలహాలు ఇచ్చారు. సమావేశం చివరలో, హాజరైన బాలింత తల్లులందరికీ 'న్యూ మదర్ కేర్ కిట్స్' పంపిణీ చేశారు.

పోషణ పక్షం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు ఇది ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు దారితీసే ఒక ఉద్యమం. ప్రతి కుటుంబం పోషకాహారాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటే, ప్రతి సమాజం ఆరోగ్యవంతంగా మారుతుంది. ■



ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోషణ పక్షం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు నీలోఫర్ ఆసుపత్రిలోని 'ధాత్రి' తల్లి పాల నిధికి అవగాహన పర్యటన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవిష్య 'ధాత్రి' కేంద్రం లక్ష్యాలు, సేవలు, తల్లి పాల ప్రోత్సాహానికి అందిస్తున్న మద్దతు కార్యక్రమాలను వివరించారు. తల్లులకు కౌన్సెలింగ్, మానసిక శ్రేయస్సు కోసం మసాజ్ థెరపీ , కుటుంబ కౌన్సెలింగ్ వంటి సేవలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

ఐ.సి.డి.ఎస్ గోల్కొండ ప్రాజెక్ట్ వారితో కలిసి కార్వాన్‌లోని కృష్ణ భవన్‌లో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 100 మంది హాజరు అయ్యారు. ఈ కార్యక్రమానికి శిశు సంక్షేమ శాఖ అధికారిణి శ్రీమతి రేణుక, స్థానిక నాయకుడు కాదిరుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు , కిమ్స్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డా. నితీషా , ఏపిమాస్ నుండి పట్టణ పోషణ పథకం మేనేజర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు , సుమారు 7 నెలల పిల్లల తల్లులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 9 మంది శిశువులకు సామూహిక అన్నప్రాశన నిర్వహించి, సమయానికి ఉప ఆహారం ప్రారంభించే ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే 0-3 నెలల శిశువుల తల్లులకు 19

# ప్రకృతి వ్యవసాయం వరికి అభినందన, ఆదరణ

– జి ఆర్ అమరేంద్రుడు

**నే**టి కాలంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల పెరుగుతున్న ఆరోగ్య సమస్యల నేపథ్యంలో, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయడం ఎంతైనా అవసరం. ఈ క్రమంలో మదనపల్లి మండలం, రేగడ గొల్లపల్లికి చెందిన ప్రోగ్రెసివ్ రైతు దూది సురేంద్ర రెడ్డి ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తున్నారు.

**ప్రస్థానం , శిక్షణ**

కొత్త వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే సురేంద్ర రెడ్డి, ఏపిమాస్ నిర్వహణలోని 'రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్' ప్రాజెక్ట్‌లో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సి ఆర్ పి) గా చేరారు. ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, క్షేత్ర సందర్శనల ద్వారా పరిజ్ఞానాన్ని పెంచుకున్న ఆయన, 2024 ఖరీఫ్‌లో వరి, రబీ 2025లో టమోటా పంటలను సాగు చేశారు.



**ఆదర్శ ప్రకృతి వ్యవసాయం**

2025 ఖరీఫ్ లో తన 2 ఎకరాల విస్తీర్ణంలో ఆర్ ఎన్ ఆర్ -15045 రకం వరిని పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మోడల్ ప్రదర్శన పంటగా సాగు చేశారు. పంట నాటినప్పటి నుండి కోత వరకు నేల సారవంతం, సస్యరక్షణ పద్ధతులను ప్రకృతి సిద్ధంగానే నిర్వహించారు.

ఈ సాగు ద్వారా ఆయనకు 5300 కిలోల (75 బస్తాలు) దిగుబడి లభించింది. మిల్లింగ్ చేయగా 3200 కిలోల ముడి బియ్యం లభించాయి.

**ప్రజల ఆదరణ – ఆరోగ్యానికి భరోసా:**

గత రెండేళ్లుగా రసాయన రహితంగా సాగు చేస్తున్న సురేంద్ర రెడ్డిని చూసి, చుట్టుపక్కల గ్రామాల రైతులు, మదనపల్లి పట్టణ వాసులు ఆకర్షితులయ్యారు. ఆయన పండించిన ఆ 3200 కిలోల బియ్యాన్ని కిలో రూ. 57/– చొప్పున 12 మంది కొనుగోలు చేశారు.

విజయకుమార్ అనే మరో కస్టమర్, రసాయన రహిత నాటు పద్ధతిలో సాగు చేసినందుకు సురేంద్ర రెడ్డి నుండి రూ. 52/– చొప్పున 200 కిలోల బియ్యాన్ని కొనుగోలు చేశారు. నేటి అనారోగ్య సమస్యలకు రసాయన వ్యవసాయ ఉత్పత్తులే కారణమని గుర్తించిన వినియోగదారులు, సురేంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నందుకు ప్రశంసించారు.

## ప్రధాని కోరిన తొమ్మిది హామీలు !

"మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ ప్రజలను కోరారు. ప్రధాని అడిగిన హామీలు:

- నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
- పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం.
- అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
- 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
- జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
- రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
- ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
- నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
- ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం.

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్ళు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

# పాలిచ్చే తల్లుల పోషణకు 'విప్రో' కిట్స్ !

– జాహ్నవి

సమాజ అభివృద్ధిలో మాతాశిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం అనేది అత్యంత కీలక అంశం. ఈ దిశగా ఏపిమాస్ పట్టణ పోషణ పథకం వారు గోపన్‌పల్లి 'విప్రో', వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు ఒక అర్థవంతమైన సామాజిక సేవలో పాల్గొని, పట్టణ పోషణ పథకం పనిచేసే బస్తీ ప్రాంతాల్లో నివసించే పాలిచ్చే తల్లులకు మద్దతు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు సమాజానికి తమ వంతు బాధ్యతను అందించారు. ఈ కార్యక్రమంలో "తల్లి–బిడ్డ సంరక్షణ కిట్లు" సిద్ధం చేయడంపై దృష్టి సారించారు. ప్రసవానంతర కాలంలో తల్లులకు అవసరమైన ఆరోగ్యం, పరిశుభ్రత, పోషణ , భావోద్వేగ మద్దతు వంటి ముఖ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కిట్లు రూపొందించబడ్డాయి. మొత్తం 140 మంది ఉద్యోగులు ఎంతో శ్రద్ధతో ఈ కిట్లను సిద్ధం చేశారు.

ప్రతి కిట్‌లో 12 ఉపయోగకరమైన వస్తువులు చేర్చబడ్డాయి. ఖర్జూరాలు, పల్లీ చిక్కీ వంటి పోషకాహార పదార్థాలు తల్లుల శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఇనుము , కాల్షియం మాత్రలు ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తాయి. చేతి శుభ్రపరిచే సానిటైజర్, కాటన్ శానిటరీ ప్యాడ్స్ (మరలా వినియోగించుకునే) వంటి వస్తువులు పరిశుభ్రతను కాపాడతాయి. వెట్ వైప్స్, ఉష్ణోగ్రత కొలిచే థర్మామీటర్, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. చిన్న గిలక శిశవు అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. అదనంగా, తల్లులకు ప్రేరణనిచ్చే విధంగా విప్రో ఉద్యోగులు ఒక అభినందన సందేశ కార్డు , తల్లిపాలు పట్టే విధానాలను చిత్ర రూపంలో కూడా ప్రతి కిట్‌లో చేర్చారు. ఈ అన్ని వస్తువులను పర్యావరణానికి అనుకూలమైన ఒక బట్ట సంచిలో వుంచి అందించారు.

ఈ కార్యక్రమం కేవలం వస్తువుల పంపిణీకి మాత్రమే పరిమితం కాలేదు. ఉద్యోగుల్లో సామాజిక సమస్యలపై అవగాహన పెంపొందించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించింది. ఉద్యోగులు, బస్తీలో నివసిస్తున్న తల్లులు ఎదుర్కొనే సవాళ్ళను అర్థం చేసుకుని, మరింత అవగాహనతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



దీనితోపాటు, ఉద్యోగులలో సేవా భావాన్ని పెంపొందించేందుకు , నిరంతరం అవలంబించేటట్లుగా ప్రత్యేక సేవా అనువర్తనాన్ని (యాప్) కూడా విప్రో ఫౌండేషన్ వారు పరిచయం చేశారు. దీని ద్వారా ఉద్యోగులు సేవా అవకాశాలను తెలుసుకోవడం, కార్యక్రమాల్లో నమోదు కావడం, తమ సేవలను గమనించడం సులభమవుతుంది. ఈ విధంగా సేవా కార్యక్రమాలను మరింత వ్యవస్థీకృతంగా దీర్ఘకాలికంగా కొనసాగించే అవకాశం వుంటుంది.

కార్యక్రమంలో ఉత్సాహాన్ని పెంచడానికి వినోదాత్మక కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. మొత్తం 140 మంది ఉద్యోగులు పాల్గొనగా, 78 మంది విజేతలుగా నిలిచి వివిధ బహుమతులను అందుకున్నారు. ఈ ఆటలు కార్యక్రమానికి మరింత ఉల్లాసాన్ని తీసుకువచ్చి, అందరిలో భాగస్వామ్యాన్ని పెంచాయి. అంతేకాకుండా, ఉద్యోగులలో మాతా శిశు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, సంస్థ , సమాజం మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడం వంటి ముఖ్య ఫలితాలను కూడా సాధించింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒక చిన్న సహాయం కూడా ఒక కుటుంబానికి ఆశాకిరణంగా మారగలదని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది.

ప్రత్యామ్నాయాలు ఎంతగా ఎక్కువైతే , లక్ష్యం అంతగా పక్కదారి పడుతుంది

# నీటి కోసం నిలిచి గెలిచిన జలసంరక్షకులు!

**వే**సవి వచ్చిందంటే అంతటా నీటి ఎద్దడికి సంబంధించిన వార్తలే. ఒకప్పుడు ఊర్లలో కళకళలాడుతూ కనిపించిన చెరువులు ఇప్పుడెందుకు ఎండిపోయాయి? సరస్సుల్లో నీరున్నా తాగడానికి ఉపయోగపడవు ఎందుకు? 21వ శతాబ్దంలో కూడా ఎంతో దూరం నడిచి, బిందెల్లో మంచినీళ్లని మోసుకువన్న గ్రామాలు ఉన్నాయంటే... సమస్య ఎక్కడ ఉంది? లోపం ఎవరిది? ఇలా అనేకానేక ప్రశ్నలు వేయకుండా... ఇది మన సమస్య, మన ఊరి సమస్య... ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో కొంతమంది నీటిని ఒడిసిపట్టుకుని... ఆయా ప్రాంతాల్లో గొప్ప 'జల సంరక్షకులు' అయ్యారు. అలాంటి కొందరు 'భగీరథుల' కథనాలివి...

**లేక్ మ్యాన్...**



దుబాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం... జీవితం సాఫీగా సాగుతోంది నిమల్ రాఘవన్‌కి. 2018లో వచ్చిన 'గజ' తుఫాన్ ఆయన్ని ఊరి బాట పట్టేలా చేసింది. ఆ తుఫానులో నిమల్ స్వగ్రామం నదియమ్‌తో పాటు 90 గ్రామాలు బాగా దెబ్బతిన్నాయి. దాదాపు లక్ష మంది నిరాశ్రయులయ్యారు. 'బౌన్స్‌బ్యాక్ డెల్టా' పేరుతో సోషల్ మీడియాలో క్యాంపెయిన్ మొదలుపెట్టారు నిమల్. కొంతమంది వలంటీర్లను కూడగట్టుకున్నారు. విరాళాలు సేకరించి తుఫానులో నష్టపోయినవారికి ఆహారం, దుస్తులు, వస్తువులు, మందులు చేరవేస్తూ ఆపన్నహస్తం అందించారు. పనిలోపనిగా తమ ఊరిలోని 'పెరవురాణి' సరస్సును పూడికతీసి ఆరు వేల ఎకరాలకు నీళ్లు అందించారు.

అలా తమిళనాడులోని తంజావూరు జిల్లా నుంచి మొదలైన 'జల సంరక్షణ' ఓ ఉద్యమంలా మారింది. ప్రస్తుతం 13 రాష్ట్రాలు, శ్రీలంక, కెన్యాలో కూడా నిమల్ సేవలు అందిస్తున్నారు. లక్షల మంది వలంటీర్లు ఆయనతో కలిసి పనిచేస్తున్నారు. ఇప్పటికే సుమారు 300 చెరువులను పునరుద్ధరించారు. పాతిక లక్షల మొక్కలని నాటారు. అలా బీడుబారిన 70 లక్షల మంది రైతుల జీవితాల్లో పచ్చదనాన్ని తీసుకొచ్చారు. అందరూ నిమల్‌ను 'లేక్ మ్యాన్' అని పిలవడం మొదలెట్టారు. 'నీళ్లని వృథా చేయకండి, నీళ్లు లేకపోతే ఏమీ లేద'ని హెచ్చరించే నిమల్ మాటలు అక్షరసత్యాలు.

**నీటి నెచ్చెలి...**



సాధారణంగా 19 ఏళ్ల పిల్లలు ఏం చేస్తారు? అటు కాలేజీ ఇటు స్నేహితులు అంటూ అదో లోకంలా ఉంటారు. కానీ అదే వయసులో ఉన్న బబితా రాజ్‌పుత్ మాత్రం 'మన ఊరిచెరువు ఎందుకు ఎండిపోతోంది... రోజూ నీళ్ల కోసం అంత దూరం ఎందుకు నడవాలి...' అని ప్రశ్నించుకుంది. మధ్యప్రదేశ్‌లోని అగ్రోథా ఆమె స్వగ్రామం. వానాకాలంలో మాత్రమే చెరువు కాసిన్ని నీళ్లతో అందంగా మారుతుంది. మిగతా సమయంలో నీటి ఎద్దడి. రోజూ చాలా దూరం నడిచి వెళ్లి మంచినీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. ఊరికి కాస్త దూరంలో నీటి కాలువ ఉన్నా, మధ్యలో కొండ ఉండడం వల్ల ఊరికి ఉపయోగకరంగా లేకపోయింది. ఇక్కడే బబిత కాస్త గట్టిగా ఆలోచించింది. కాలువ నీళ్లని చెరువులోకి మళ్లించడానికి కొండ పక్క నుంచి ఓ కాలువ తవ్వాలని బబిత నిర్ణయించుకుంది.

కానీ సవాలక్ష అడ్డంకులొచ్చాయి. చెరువును ఆక్రమించుకున్న రైతులు అడ్డుపడ్డారు. ప్రభుత్వ నిబంధనలు భయపెట్టాయి. ఆఖరుకి ఓ ఎన్‌జీఓ సహాయంతో బబిత కావలసిన అనుమతులు తెచ్చుకుంది. గట్టి సంకల్పంతో 2018లో ఆమె 12 మంది మహిళలతో కలిసి 'జల్ సహేలీ' బృందాన్ని ఏర్పరచి, కాలువ తవ్వడం ప్రారంభించారు. ఆ బృందం మొక్కవోని దీక్షను చూసి పొరుగున ఉన్న పది గ్రామాల మహిళలూ వచ్చి చేరారు. అలా రెండు వందలకు చేరుకున్న ఆ బృందం 12 అడుగుల వెడల్పుతో 107 మీటర్ల

పొడవున కొండను తవ్వి, కాలువచేసి నీళ్ల దారిని మళ్లించింది. ఇప్పుడు గ్రామంలో నీటి ఎద్దడే లేదు. పైగా ఎండిపోయిన బావుల్లో కూడా నీళ్లు బాగా చేరాయి. పంటపొలాలతో గ్రామ రూపురేఖలే మారిపోయాయి. చిన్న వయసులోనే గట్టి సంకల్పంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందీ నీటి నెచ్చెలి!.

**బోర్లకు జీవం...**



ప్రస్తుతం ప్రపంచం అంతా రీఛార్జ్ చుట్టే తిరుగుతోంది. ఎండిపోయి, పనిచేయకుండా పోయిన బోర్లను రీఛార్జ్ చేస్తే నీటి ఎద్దడి సమస్య సగం వరకూ తీరుతుంది కదా! ఇదే ఆలోచనను నిజం చేసి 'జల యోధుడి'గా మారారు దేవరాజ్ రెడ్డి ఎన్ ఎ. కర్ణాటకలోని చిత్రదుర్గకు చెందిన దేవరాజ్ భూగర్భ జల శాస్త్రవేత్త. ఎండిపోయిన బోర్‌వెల్స్‌ను రీఛార్జ్ చేసే టెక్నాలజీని ఈయన కనుగొన్నారు. దీని ఖరీదు కూడా తక్కువ. గత మూడు దశాబ్దాలుగా ఇరవై వేలకు పైగా బోర్లను ఆయన రీఛార్జ్ చేశారు. రెండు లక్షలకు పైగా ఎకరాలలో పంటల సాగుకు తోడ్పడి, రైతుల జీవితాలనూ, నేల తల్లినీ సస్యశ్యామలం చేశారు.

**'ఇన్‌స్టా'తో అవగాహన...**

ఇన్‌స్టాలో ప్రతి ఒక్కరూ తమ గురించి గొప్పగా చెప్పుకుంటారు. కానీ ముంబైకి చెందిన లిస్బన్ ఫెరారో ఇన్‌స్టా చూస్తే '900 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరాను. అందులో 40 టన్నులు రీసైకిల్ చేశా. 3 వేల మొక్కలను నాటాను..' అని చెప్పుకుంటారు. పైగా. ' మనం చేయగలం! అహం వీడండి, చెత్త తీయండి ! ('వియ్ కెన్ డూ ఇట్. డ్రాప్ ద ఈగో, పిక్ అప్ ద ట్రాష్') అని సముద్ర తీరాల్లో చెత్త ఎత్తుతూ క్యాప్షన్‌లు పెడుతుంటారు. ఇన్‌స్టాలో లిస్బన్ ఫెరారోకి 25 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షకుడిగా లిస్బన్ కథ 2017లో మొదలైంది. అప్పుడు ఆయన మార్కెటింగ్ రంగంలో పనిచేసేవారు. ఓ ఆదివారం పిల్లలతో కలిసి బొరివలీ బీచ్‌కు వెళ్లారు. అక్కడ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే. ఆయన హృదయం ద్రవించిపోయింది. తన చిన్నప్పుడు అక్కడి స్వచ్ఛమైన ఇసుకలో గంటలు గంటలు ఆడుకున్న గుర్తు. తన పిల్లలకీ అలాంటి జ్ఞాపకాలే అందించాలని అనుకున్నారు. అప్పటి నుంచి ఎప్పుడు బీచ్‌కు వెళ్లినా చెత్తని ఏరి డస్ట్‌బిన్లలో పోగేసేవారు. ఓసారి వాళ్లు చేస్తున్న పనిని ఫొటోలు తీసి, 'క్లీన్ చేయక ముందు, చేశాక..' అని క్యాప్షన్‌లో రెండు ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవి బాగా వైరలయ్యాయి. ఎంతోమంది వలంటీర్లు చేతులు కలిపారు. 'వసై బీచ్ క్లీనర్స్' పేరున ఎన్‌జీఓ సంస్థను నెలకొల్పి, 20 వేల మంది వలంటీర్లతో బీచ్‌లను, సరస్సులు, చెరువులను శుభ్రపరుస్తూ అసలైన పర్యావరణ యోధుడిగా ముందుకు సాగుతున్నారు లిస్బన్.

**సరస్సు సంరక్షకుడు**



టూరిస్టుల అవగాహనలేమితో చాలా పర్యాటక ప్రాంతాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. స్వచ్ఛమైన సరస్సులూ కాలుష్యం బారిన పడిపోతున్నాయి. అలాంటి ఓ సరస్సే 'సోమ్గో'. గాంగ్‌టక్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో పన్నెండు వేల అడుగుల ఎత్తున ఉన్న ఈ సరస్సు సిక్కిం రాష్ట్రంలో చూడచక్కని పర్యాటక ప్రాంతం. సిక్కిం వాసులకు పుణ్యతీర్థం 'సోమ్గో'. అయితే అధిక సంఖ్యలో యాత్రికుల రాక కారణంగా ఈ సరస్సు క్రమక్రమంగా వ్యర్థాలతో నిండిపోయింది. దాంతో చుట్టుపక్కల ఇళ్ల వారికి తాగునీళ్ల కొరత ఏర్పడింది. ఆ రాష్ట్రానికే చెందిన సంజయ్ లామా అనే యువకుడు 2008లో కొంతమంది యువకులతో కలిసి సోమ్గో ప్రక్షాళన పనిని చేపట్టారు. ఆ సరస్సు నుంచి ఏకంగా 20 లారీల చెత్తని వెలికితీశారు. 'సోమ్గో పోఖ్రి సంరక్షణ్ సమితి' అనే సంస్థను స్థాపించి వ్యర్థ పదార్థాల నిర్వహణనూ కొనసాగిస్తున్నారు. దీనికి అటవీ శాఖ, వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యుడబ్ల్యుఎఫ్)తో కలిసి ఆయన పనిచేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటిని అందించే సరస్సుగా సోమ్గో నేడు పరివర్తన చెందింది. 'పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిదీ. మనం పరిశుభ్రంగా ఉంటే... రాష్ట్రం, దేశం



కూడా పరిశుభ్రంగా మారుతాయి' అని చెప్పే సంజయ్ మాటలు అనుసరణీయం.

**చెక్‌డ్యాముల అమ్మ...**

గాలి, నీళ్లు లేకపోతే మనుగడే లేదు. అయితే విచిత్రంగా ఈ రెండింటి గురించి పెద్దగా పట్టించుకోం. కానీ రాజస్థాన్‌లోని బీడు నేలలను చూసిన అమ్లా రూయి చలించిపోయారు. 2006లో 'ఆకార్ ఛారిటబుల్ ట్రస్ట్' స్థాపించి నీటి సంరక్షణ కార్యక్రమాలను చేపట్టారు అమ్లా. మాండవార్ గ్రామంలో మొదటి చెక్‌డ్యామ్‌ను నిర్మించారు. దీంతో అక్కడి ప్రజల జీవన పరిస్థితులు మారిపోయాయి. రైతులు ఆ ఏడాది 12 కోట్ల రూపాయలు సంపాదించారు. ఇప్పటిదాకా ఆమె దాదాపు 900 చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. దీంతో 500 సరస్సులు జలరాశులతో నిండిపోయాయి. ఫలితంగా రెండు వేలకు పైగా గ్రామాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ప్రతీ ప్రాజెక్టులో స్థానికులను భాగస్వాములుగా చేసుకుని ముందుకు సాగడం అమ్లా రూయి విజయ రహస్యం. తమ జీవితాలూ మారిపోవడం వల్ల అమ్లా రూయిని అందరూ 'నీళ్ల అమ్మ'గా పిలవడం మొదలెట్టారు. 'కౌన్ బనేగా కరోడ్‌పతి'లో అమ్లా రూయిని 'జల్ దేవీ'గా అమితాబ్ బచ్చన్ కీర్తించడం విశేషం.

**నీళ్ళడాక్టర్**

ప్రతిరోజూ మూడు కిలోమీటర్లు నడిస్తేనే ఇంట్లోకి నీళ్ళు వచ్చేది. అలా చిన్నప్పుడు ఎన్ని ఉదయాలు అమ్మకు తోడుగా వెళ్లాడో కానీ ఇప్పుడు 'నీళ్ల డాక్టర్'గా మారారు. ఆయనే అయ్యప్ప మసగి. కర్ణాటకకు చెందిన అయ్యప్ప ఓ మెకానికల్ ఇంజినీర్. 23 ఏళ్ల సర్వీస్ తరవాత ఉద్యోగానికి రాజీనామా చేసి, గ్రామాల బాట పట్టారు. 'వాటర్ లిట్రసీ ఫౌండేషన్'ను నెలకొల్పారు. 26 వేల హెక్టార్ల బీడు భూమిని మాగాణిగా మార్చారు. ఎన్నో సరస్సులు, బావులు, బోర్ బావులను పునరుద్ధరించారు. బెంగళూరు పరిసరాల్లోని సుమారు 200 పరిశ్రమల్లో వాన నీటి సంరక్షణ పథకాలను ప్రారంభించారు. ఆయన ఎక్కడికి వెళితే అక్కడ నీళ్ల ఊటపడుతుందని ప్రజలు గట్టిగా విశ్వసిస్తారు. చాలామంది 'నీళ్ల డాక్టర్', 'వాటర్ గాంధీ', 'బోర్‌వెల్ డాక్టర్', 'మోడ్రన్ భగీరథ'... ఇలా రకరకాల పేర్లతో అయ్యప్పను కీర్తిస్తారు.



'దేవుడు సృష్టించిన అతి పెద్ద సరస్సు భూమి. ప్రతీ నీటి చుక్కనీ వినియోగించాలి కానీ వృథా చేయరాదు' అని అయ్యప్ప పేర్కొంటారు. తన ప్రయత్నాలన్నింటినీ 'భగీరథ: వార్ ఆన్ వాటర్ క్రైసిస్' పేరున అక్షరబద్ధం చేశారు.

**వ్యర్థాలను ఏరుతూ...**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్‌కీ బాత్'లో ప్రశంసలు అందుకున్న నీటి యోధుడు రామ్‌వీర్ తన్వర్. నోయిడాకు చెందిన రామ్‌వీర్ కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి సరస్సుల పరిరక్షణకు తన జీవితాన్ని ధారపోస్తున్నారు. సరస్సుల్లోని వ్యర్థాలను ఏరుతూ, నీటి దారులను మెరుగుపరుస్తూ నీటి నిల్వలను పెంచుతున్నారు. 'సే ఎర్త్' పేరుతో ఎన్‌జీఓ నెలకొల్పారు. ఇప్పటిదాకా 50 ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్‌లు పెంచారు. ఏడు రాష్ట్రాలలో 80కి పైగా చెరువులను పునరుద్ధరించారు. నీటి సంరక్షణకు సంబంధించి 'జల్ చౌపాల్' పేరున ఊరూరా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. 'టెడ్‌ఎక్స్'లో పాల్గొని కాలుష్యం లేని జలవనరులను తీర్చిదిద్దాల్సిన అవసరం గురించి రామ్‌వీర్ ఆలోచింపజేసేలా మాట్లాడి ఆకట్టుకున్నారు.

దేశవ్యాప్తంగా ఇలాంటి ఎంతోమంది జలసంరక్షకులు అడుగంటిపోతున్న నీటి నిల్వలకు జీవం పోస్తూ... నీటి చుక్కను జాగ్రత్తగా ఒడిసి పట్టుకుంటున్నారు. నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇలాంటి వాటర్ వారియర్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని... వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు మనవంతు కర్తవ్యాన్ని కూడా నిర్వహించాల్సిందే కదా! నీటిని పొదుపుగా వాడుదాం ... నీటి వనరులను కాపాడుకుందాం!

(ఆంధ్రజ్యోతి ఆదివారం) సౌజన్యంతో)

ఎంతటి మహా ప్రవాహమైనా చిన్న నీటి ధారగానే మొదలవుతుంది

# పంటల సంరక్షణ పేరిట మూగజీవాల హింస!

**వ**న్య ప్రాణుల కోసం వేటగాళ్లు, అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు కొందరు రైతులు కొత్త పుంతలు తొక్కు తున్నారు. అవసరమైతే వాటి ప్రాణాలు తీయడం ద్వారానైనా తమ లక్ష్యాన్ని నెరవేర్చుకుంటున్నారు. ఆ చర్యల వల్ల ఇతర మూగ జీవాలకు పెను ముప్పు వాటిల్లుతున్నది. ఇప్పటి దాకా పంటల చుట్టూ తీగలు అమర్చి, రాత్రి వేళల్లో వాటికి విద్యుత్ ప్రసారం చేయడం ద్వారా వన్య ప్రాణులు పొలాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. చేను చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు అడవి పందులు ప్రాణాలు కోల్పోతాయి గనుక పంట నష్టం వాటిల్లదనే భావనలో రైతులు ఉండేవారు. అయితే అవే విద్యుత్ తీగలకు తగిలి మనుషులు మృత్యువాత పడ్డ సంఘటనలు కోకొల్లలు. కొన్ని సందర్భాల్లో విద్యుత్ తీగలు అమర్చిన రైతులే వాటికి తగిలి మరణించిన దాఖలాలు కూడా ఉన్నాయి.

**యథేచ్ఛగా పేలుడు పదార్థాల వినియోగం....**

వన్య ప్రాణుల వేట, అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు గుర్తు తెలియని వ్యక్తులు కొందరు యథేచ్ఛగా పేలుడు పదార్థాలు వినియోగిస్తున్న సందర్భాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. పత్తి, వరి పొలాల వద్ద వన్య మృగాలు సంచరించే దారిలో పేలుడు పదార్థాలు ఉంచుతున్నారు. 2022 ఏప్రిల్ 2వ తేదీన పాత మంచిర్యాల నివాసి బండారి సంతోష్‌కు చెందిన ఓ బర్రె గోదావరి ఒడ్డున మేతకు వెళ్లి పొరపాటున పేలుడు పదార్థం తినగా అది పేలి దాని నోరు భాగం తునాతునకలైంది. (అనంతరం బర్రె చనిపోయింది). తాజాగా జన్నారం మండలం బాదంపల్లి గ్రామ సమీపంలో గోదావరి నది ఒడ్డున పేలుడు సంభవించి ఓ బర్రె తీవ్రంగా గాయపడింది. అక్కడ వన్యప్రాణులను వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు పేలుడు పదార్థాలు అమర్చినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన పశువుల కాపర్లు తమ బర్రెలను మేతకు తీసుకెళ్లగా అవి మేస్తుండగా ఒక్కసారిగా పేలుళ్లు సంభవించాయి. అదే ప్రాంతంలో పేలుళ్ల దాటికి నాలుగు రోజుల క్రితం నాలుగు మేకలు మృతి చెందినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

**వన్య ప్రాణులను హతమార్చడమే లక్ష్యంగా....**

పాత మంచిర్యాలలో గోదావరి సమీపంలో పేలుడు సంభవించిన ప్రాంతంలో అడవి పందులతో పాటు జింకలు, కుందేళ్లు కూడా అనేకం ఉన్నాయి. నదిలో నీరు ఉన్నందున దాహం తీర్చుకునేందుకు అవి తరుచుగా అక్కడికి వస్తుంటాయి. దీంతో వేటగాళ్లే వాటిని హతమార్చేందుకు మందు గుండు ప్రయోగం చేశారనే అభిప్రాయాలు ఉన్నాయి. గతంలో అనేక మార్లు ఆ ప్రాంతంలో వన్య ప్రాణుల వేట కోసం ఉర్లు అమర్చేవారు. ఉర్లలో చిక్కుకుని అడవి పందులు, ఇతర వన్య ప్రాణులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పొరపాటున మందు గుండు ఉన్న పదార్థాన్ని మనుషులు తొక్కి ఉంటే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**చట్టం ఏం చెబుతోంది...**

పంటలకు నష్టం కలిగించే అడవి పందుల నిర్మూలనకు వన్య ప్రాణి చట్టంలో ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. అడవి పందుల బెడద ఉన్నచోట గ్రామ సర్పంచు సమక్షంలో రైతులు వాటిని హతమార్చడానికి తీర్మానం చేయాలి. అనంతరం అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రభుత్వం అడవి పందులను కాల్చివేసేందుకు నిపుణులైన షూటర్లను ఏర్పాటు చేస్తుంది. షూటింగ్ ప్రాంతానికి ప్రజలు వెళ్లకుండా ముందు రోజు గ్రామంలో టాంటాం చేయించాలి. షూటింగులో మనుషుల ప్రాణాలకు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలి. అంతేగాని నేరుగా ప్రజలే అడవి పందులను హతమార్చడం వన్య ప్రాణి చట్టం ప్రకారం నేరం. దీన్ని అతిక్రమించిన వారిపై వన్య ప్రాణి చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయి.

(ఆంధ్ర జ్యోతి సౌజన్యంతో)

■

దారి లేదని నిరాశ చెందకు, మూసుకుపోయినట్టు కనిపించేదారి ఒక మేలు మలుపు కావచ్చు

# 'నూకల' దెబ్బకు కలుపు బలాదూర్ !

వరి పొలాల్లో కలుపు నివారణకు రైతులు రసాయనిక గడ్డి మందులు / కలుపు మందులు పిచికారీ చెయ్యటం రివాజు. అయితే, ప్రస్తుత రబీ పంట కాలంలో తెలుగు రాష్ట్రాల్లో నీరు నిల్వగట్టే పద్ధతిలో వరి సాగు చేసే కొందరు వరి రైతులు ఒక సరికొత్త ప్రయోగం చేసి కలుపుపై నూటికి నూరు శాతం సక్సెస్ అయ్యారు. కలుపు మందులకు బదులుగా వరి బియ్యం నూకలను నాట్లు వేసిన పొలంలో చల్లి కలుపు మొలవకుండా అడ్డుకున్నారు.

ఎకరానికి రూ.5 వేలకు పైగా రైతులకు ఖర్చు తగ్గటంతో పాటు పర్యావరణానికి మేలు జరిగింది. ప్రముఖ రైతు శాస్త్రవేత్త పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతల వెంకటరెడ్డి (సీవీఆర్) చెప్పిన ఈ చిట్కా సూపర్ హిట్ అయ్యింది. వరి నాటిన మొదటి 3 రోజుల్లో ఒకసారి, 25వ రోజు మరోసారి ఎకరానికి 100 కిలోల చొప్పున వరి బియ్యం నూక (రెండుసార్లు కలిపి ఎకరానికి 200 కిలోలు) చల్లాలని ఆయన సూచించారు. ఈ ఆవిష్కరణపై జనవరి 6న 'సాక్షి సాగుబడి'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.

తెలుగు రాష్ట్రాల్లో సేంద్రియ ప్రకృతి వ్యవసాయదారులతో పాటు రసాయనిక ఎరువులు వాడే రైతులు, సమస్యాత్మక చౌడు భూముల్లో వరి పండించే రైతులు కూడా సత్ఫలితాలు పొందుతుండటం విశేషం. వరి నూకలు లేకపోతే ధాన్యాన్ని మరపట్టించి పొట్టుతో సహా పొలంలో చల్లినా కలుపు సమస్య తీరిందని రైతులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో దీనిపై అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**నూకలు కలుపును ఏలా నియంత్రిస్తాయంటే?**

నూకలు చల్లితే కలుపు నియంత్రణ జరగటానికి వెనుక శాస్త్రీయత ఏమిటి అని ప్రశ్నించినప్పుడు తన పేరు వెల్లడించటానికి అంగీకరించని ఒక సీనియర్ శాస్త్రవేత్త ఇలా వ్యాఖ్యానించారు: 'నూకలను వరి పొలాల్లో చల్లితే కలుపు నివారణకు సహాయపడుతుంది. ఒక రకమైన అచ్ఛాదన పొర (మల్చింగ్ లేయర్) ఏర్పడుతుంది. ఈ పొర సూర్యరశ్మిని అడ్డుకుంటుంది. కలుపు మొక్కల పెరుగుదలను అణచివేస్తుంది. కలుపు విత్తనాలు మొలకెత్తలేవు. పొలంలో నిల్వగట్టిన నీటి ఆవిరి నష్టం, నేల కోత తగ్గుతుంది. నేల ఆరోగ్యం మెరుగవుతుంది. పంట పెరుగుదలకు తోడ్పడుతుంది. అయితే, వరి పొలాల్లో నూకలు చల్లితే ఏమవుతుందనే అంశంపై శాస్త్రీయంగా పటిష్టమైన అధ్యయనాలు ఇప్పటివరకు జరగలేదు. వరి పొట్టు బయోచారు పొలంలో చల్లినా కూడా ఈ ఫలితాలు వస్తాయి. ఈ విషయం పరిశోధనల్లో ఇప్పటికి నిర్ధారణైంది.

**మోకాళ్ళ ఎత్తు తుంగ పోయింది!**

రెండు పొలాల్లో మొత్తం 10.5 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఎకరానికి 1 బస్తా డీఏపీ, మూడు సార్లు కలిపి 25 బస్తాల యూరియా, అర బస్తా పొటాష్ వాడుతుంటాను. ఈ రబీ సీజన్‌లో 4.5 ఎకరాల పొలంలో డ్రమ్ సీడర్తో 'ఆర్ఎస్ఆర్ 31479' వరి విత్తనాలు వేశాను. తుంగ మోకాళ్ల ఎత్తు పెరిగింది. వరి మొక్కలు దానికి సగం ఎత్తులోనే ఉన్నాయి. పంట పోయినట్లే నని దున్నేద్దాం అనుకున్నా.

ఆ దశలో చింతల వెంకటరెడ్డి గారు నూకల గురించి చెప్పింది విని 4.5 ఎకరాల్లో 170 కిలోల సన్న (చీరు) నూకలను 3 కట్టల యూరియాలో కలిపి చల్లా. వారం రోజుల తర్వాత నుంచి తుంగ వాడిపోవటం మొదలైంది. కొన్నాళ్లలో తుంగ పూర్తిగా నేలవాలింది. వరి మొక్కలు మాత్రం ఏపుగా పెరిగాయి. కోతల నాటికి తుంగ ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది. పోయిందనుకున్న పొలంలో ఎకరానికి 35 బస్తాలు పండింది. అందరితో పాటు నేనూ ఆశ్చర్యపోయాను. మరో 6 ఎకరాల్లో 'కేఎన్ ఎం 12368' వరి నాట్లు వేశాను.

తుంగ, ఇతర కలుపు లేకపోయినా రెండో దఫా వేసి 3

కట్టల యూరియాతో పాటు 150 కిలోల నూకలు కలిపి చల్లాను. పంట బాగా పెరిగి కోతకు వచ్చింది. ఎకరానికి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. చివరి విడత యూరియా, పొటాష్ వెయ్యాల్సిన అవసరం రాలేదు. నూకల వల్ల పురుగుమందులు, ఫంగిసైడ్స్ చల్లాల్సిన అవసరం రాలేదు. పురుగుమందుల ఖర్చే ఎకరానికి రూ.5 వేలు మిగిలాయి. క్వింటా నూకలకు రూ.1,800 వరకు ఖర్చవుతున్నది అయినా, వీటిని చల్లటం వల్ల తుంగ వంటి మొండి కలుపు కూడా పోవటం ఒక్కటే కాదు ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

**–** వల్లభనేని వెంకట్రావు (81793 84318), లింగగిరి, హుజూర్నగర్ మం. సూర్యాపేట జిల్లా

**చౌడు సమస్య తగ్గింది.. కలుపు మొలవ లేదు..**

మాది 2 ఎకరాల చౌడు పొలం. సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. చింతల వెంకటరెడ్డి గారు చెప్పినట్లు కలుపు నివారణకు నూకలు చల్లితే మంచి ఫలితాలు వచ్చాయి. 1.25 ఎకరాల వరి పొలంలో రెండు దఫాలుగా ఎకరానికి 100 కిలోల చొప్పున నూకలు చల్లాను, తుంగ, గరిక తదితర కలుపు మొలవలేదు. అంతేకాదు, చౌడు వల్ల ప్రతి ఏటా మొక్కలు చాలా చనిపోయేవి. కానీ, నూకలు వేశాక మొక్కలన్నీ బతికాయి. 30 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. మరో, 75 సెంట్ల వరి పొలంలో నూకలు ఒక్కసారే వేశాను. రెండోసారి వెయ్యలేదు. మొక్కలు 20% పోయాయి. ఇంకా పంట కొయ్యలేదు. నూకలు చల్లిన తర్వాత కొన్ని రోజులకు మురుగు వాసన వస్తుంది. అయితే, కలుపు పెరగదు. కలుపు మందులు కొట్టినా కలుపు అంతో ఇంతో వస్తూనే ఉంటుంది. నూకలు కలుపు రాకుండా చెయ్యటంతో పాటు చౌడు సమస్యలను కూడా తగ్గించాయి.

**– చిన్నపరెడ్డి నరసింహారెడ్డి (94406 86885),** తిమ్మంపేట, జఫర్ గఢ్ మం., జనగామ జిల్లా

**శాస్త్రీయ పరిశోధన చెయ్యాలి**

ఇవన్నీ కూడా మన సంప్రదాయ వైద్యంలో చెప్పే విషయాల వంటివి. ఏదైనా ఫలితాలనిస్తే దాన్ని మనము ఆలోచించాలి. అయితే, కొందరు రైతులు బాగుంది అంటున్నారు కాబట్టి. ఇంకా విస్తృత స్థాయిలో పరీక్షించాలి. క్రమబద్ధ శాస్త్రీయ పరిశోధన చేయకుండా దీన్ని మనం సిఫార్సు చేయటం సాధ్యం కాదు.

**డాక్టర్ చెన్నబోయిన దామోదర రాజు,** అధిపతి–ప్రధాన శాస్త్రవేత్త, వరి పరిశోధనా సంస్థ, ప్రొ॥ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.

**ఎకరానికి 50 కిలోలు చల్లినా కలుపు రాలేదు**

వరి పొలాల్లో నూకలు చల్లితే కలుపు సమస్య తీరిపోవటం ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజమని ఈ రబీ పంట కాలంలో తొలిసారి నా అనుభవంలో రుజువైంది. 1.25 ఎకరం పడావు భూమిని సిద్ధం చేసి నాట్లు వేశాం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నాం. నాట్లేసిన రెండో రోజు, 25వ రోజు వంద కిలోల చొప్పున వరి బియ్యం నూకలు చల్లాం. మా పొలంలో కలుపు అసలు రాలేదు. పంట ఎర్రబడకుండా ఆకుపచ్చగా ఆరోగ్యంగా ఉంది. త్వరలో కోతకు రానుంది.

పొలాన్ని వీడియోతీసి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తే, అనుసరించిన 60–70 మంది రైతులు ఫోన్ చేసి తమ అనుభవాలు చెప్పారు. ఎకరానికి 50 కిలోల నూకలు వేసిన పొలాల్లో కూడా కలుపు నివారణ జరిగింది. నాట్లేసిన తర్వాత 10–26 రోజులకు నూకలు చల్లిన పొలాల్లోనూ కొత్తగా కలుపు పుట్టలేదు. మా తమ్ముడు పొలంలో కనీసం రెండుసార్లు కలుపు తీయిస్తాడు. నాట్లేసిన 20 రోజులకు ఒకసారి కలుపు తీసినాక ఒకే ఒక్కసారి ఎకరానికి వంద కిలోలు నూకలు చల్లినా కలుపు మళ్లీ రాలేదు.

చౌడు భూముల్లో ఆర్గానిక్ వరి సాగు చేసే పొలాల్లో నూకలు చల్లినా కలుపు రాలేదు. మొక్కలు చనిపోవటం, ఎరుపు రంగుకు మారటం కూడా జరగలేదని రైతులు చెబితే ఆశ్చర్యం కలిగింది. కలుపు మందులు జెన్సర్ కారకాలని చెబుతున్న నేపథ్యంలో నూకలతో కలుపు నివారణ ఆవిష్కరణను సీవీఆర్ అందించటం సంతోషదాయకం.

**– పడాల గౌతమ్ (98497 12341), ఎస్టేట్ మేనేజర్, రిషి వ్యాలీ స్కూల్, మదనపల్లి** (సాక్షి సౌజన్యంతో) ■

# దేశీ కోళ్ళ పెంపకం ... లాభదాయక వ్యాపారం

పల్లెటూర్లలో తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించాలనుకునే యువతకు దేశీ కోళ్ళ పెంపకం గొప్ప అవకాశం. తక్కువ పెట్టుబడితో ఈ వ్యాపారం ప్రారంభించి, అధిక ఆదాయం పొందవచ్చు. తక్కువ ఖర్చు, స్థానికంగా డిమాండ్ ఉన్న దేశీ కోళ్లు, గుడ్ల విక్రయం ద్వారా గ్రామీణ యువత ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు.

పల్లెటూరుల్లో తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం అందించే వ్యాపారాలపై యువతలో ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా కేవలం రూ.50 వేలతో ప్రారంభించగల దేశీ కోళ్ల పెంపకం (నేటివ్ చికెన్ ఫార్మింగ్) ఇప్పుడు గ్రామీణ యువతకు లాభదాయకమైన బిజినెస్‌గా మారుతోంది. వ్యవసాయం ఆధారిత జీవనశైలిలో భాగంగా ఉండే ఈ వ్యాపారం, తక్కువ ఖర్చుతో ప్రారంభించవచ్చు. స్థానికంగా లభించే దేశీ కోళ్లు ఆరోగ్యానికి మంచివి కావడంతో, మార్కెట్‌లో వీటికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రారంభ దశలో 40-50 కోళ్లను కొనుగోలు చేసి, చిన్న షెడ్ ఏర్పాటు చేస్తే సరిపోతుంది. మిగిలిన మొత్తాన్ని ఆహారం, మందులు, ప్రాథమిక సంరక్షణ కోసం వినియోగించవచ్చు.

దేశీ కోళ్లు సాధారణ బ్రాయిలర్ కోళ్లతో పోలిస్తే తక్కువ సంరక్షణతోనే పెరుగుతాయి. వీటిని ఎక్కువగా ఓపెన్ ఏరియాలో పెంచవచ్చు, కాబట్టి ఖర్చులు కూడా తగ్గుతాయి. ముఖ్యంగా గ్రామాల్లో అందుబాటులో ఉండే ధాన్యాలు, మిగిలిన ఆహారంతో కూడా వీటిని పోషించవచ్చు. 4-5 నెలల్లో కోళ్లు విక్రయానికి సిద్ధమవుతాయి. ఈ వ్యాపారం ద్వారా రెండు విధాలుగా ఆదాయం పొందవచ్చు, కోళ్ల అమ్మకం, గుడ్ల విక్రయం. దేశీ కోడి గుడ్లకు నగరాల్లో కూడా మంచి ధర లభిస్తుంది. ఒక్క గుడ్డు రూ.10-15 వరకు అమ్ముడవుతుంది. అలాగే పెద్ద కోళ్లు ఒక్కటి రూ.500 - రూ.800 వరకు అమ్మే అవకాశం ఉంది.

అదనంగా ఈ వ్యాపారాన్ని క్రమంగా విస్తరించే అవకాశం కూడా ఉంది. ప్రారంభంలో చిన్న స్థాయిలో మొదలుపెట్టి, లాభాలను మళ్లీ పెట్టుబడిగా పెట్టి కోళ్ల సంఖ్యను పెంచుకోవచ్చు. సరైన మార్కెటింగ్ చేస్తే సమీప పట్టణాలకు సరఫరా చేసి మరింత ఆదాయం పొందవచ్చు. అయితే వ్యాధుల నివారణ, శుభ్రత, సమయానికి ఆహారం వంటి అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

# ఎముకల బలానికి, గుండె ఆరోగ్యానికి విటమిన్ 'కె'

మనం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే శరీరానికి అన్నిరకాల విటమిన్లు, పోషకాలు సమపాళ్లలో అందాలి. వాటిలో విటమిన్ కె పాత్ర చాలా కీలకం. ఇది ప్రధానంగా రెండు ముఖ్యమైన పనులను నిర్వర్తిస్తుంది. ఒకటి: రక్తం గడ్డకట్టే ప్రక్రియలో సహాయపడటం. రెండు: ఎముకల ఆరోగ్యాన్ని కాపాడటం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది కూడా.

**విటమిన్ కె అధికంగా ఉండే ఆహారాలు**

**పాలకూర :** అత్యంత సులభంగా, చౌకగా లభించే ఆకుకూరల్లో పాలకూర ఒకటి. ఇందులో విటమిన్ కె అధిక మోతాదులో ఉంటుంది.

**ద్రాక్ష :** రుచికరమైన ఈ పండ్లలో విటమిన్ కెతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి.

**క్యాబేజీ :** క్యాబేజీ కూడా విటమిన్ కె కి మంచి మూలం. ఇది ఎముకల సాంద్రత తగ్గిపోకుండా కాపాడుతుంది. వృద్ధాప్యంలో వచ్చే ఎముకల సమస్యలను నివారిస్తుంది.

**పుదీనా :** కేవలం సువాసనకే కాకుండా ఆరోగ్యానికి కూడా పుదీనా ఎంతో మేలు చేస్తుంది. చట్నీలు, పానీయాల రూపంలో దీనిని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్ కె అందడంతో పాటు, తాజాదనం, శక్తి లభిస్తాయి.

**బ్రోకోలీ :** బ్రోకోలీలో విటమిన్ కె, విటమిన్ సి, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల దృఢత్వానికి , శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా దోహదపడుతుంది.

ఇంకా, కివి పండులో కూడా విటమిన్ కె పుష్కలంగా వుంటుంది.

# తెలంగాణాలో జాతీయ అత్యుత్తమ పంచాయతీల జోరు!

**కేం**ద్ర పంచాయతీరాజ్ శాఖ తాజాగా విడుదల చేసిన 'పంచాయతీ అభివృద్ధి సూచీ (పీఏఐ)' 2.0 (2023-24)లో తెలంగాణ రాష్ట్రం అగ్రశ్రేణిలో నిలిచింది. పారదర్శకత, జవాబుదారీతనంలో దేశానికే దిక్సూచిగా నిలిచింది. రాష్ట్రంలోని మొత్తం 12,556 గ్రామ పంచాయతీల వివరాలను నమోదు చేసి ఆదర్శంగా నిలిచింది. అత్యుత్తమ గ్రేడింగ్ సాధించిన జాబితాలోనూ దేశంలో తెలంగాణ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.

'ఏ' గ్రేడ్‌లో తెలంగాణ హవా..

తాజా పీఏఐ 2.0 స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న పంచాయతీలను కేంద్రం ఏ+, ఏ, బి, సి, డి గ్రేడ్‌లుగా వర్గీకరించింది. దేశవ్యాప్తంగా ఒక్క పంచాయతీ కూడా ఓవరాల్‌గా 'ఏ+' (90కి పైగా స్కోర్) గ్రేడ్‌లో నిలవలేదు. తర్వాత 'ఏ' గ్రేడ్(75 నుంచి 90 స్కోర్)లో దేశవ్యాప్తంగా 3,635 పంచాయతీలు నిలవగా,అందులో 624 పంచాయతీలు తెలంగాణావే కావడం విశేషం. 943 పంచాయతీలతో త్రిపుర అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణా రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆంధ్రప్రదేశ్ (591), ఒడిశా (555) నిలిచాయి. ఇక రాష్ట్ర పంచాయతీల్లో అత్యధికంగా 10,056 పంచాయతీలు 'బి' గ్రేడ్‌లో, 1,853 పంచాయతీలు 'సి' గ్రేడ్‌లో, 23 పంచాయతీలు 'డి' గ్రేడ్‌లో నిలిచాయి.

పలు విభాగాల్లో అత్యుత్తమ గ్రేడ్‌లు

ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పంచాయతీల పనితీరును మొత్తం 9 ఇతివృత్తాల (థీమ్స్) ఆధారంగా అంచనా వేశారు. అందులో పలు కేటగిరీల్లో రాష్ట్ర పంచాయతీలు కొన్ని 'ఏ+(అచీవర్)' గ్రేడ్‌ను సాధించాయి.

▶ పేదరిక రహిత, మెరుగైన జీవనోపాధి పంచాయతీ: నల్గొండజిల్లా వేములపల్లి బ్లాక్ రావులపెంట (97.50 స్కోర్).

▶ ఆరోగ్యకరమైన పంచాయతీ: నిర్మల్ జిల్లా కుంటాల బ్లాక్ వెంకూర్ (91.33 స్కోర్).

▶ బాలల స్నేహపూర్వక పంచాయతీ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ బ్లాక్ వెంకటంపల్లి (96.67 స్కోర్).

▶ నీటి సమృద్ధి గల పంచాయతీ: వరంగల్ జిల్లా నర్సంపేట బ్లాక్ పాత మఖ్దూంపురం(95.00 స్కోర్).

▶ పరిశుభ్రమైన, పచ్చని పంచాయతీ: వరంగల్ జిల్లా దుగ్గొండి బ్లాక్ నారాయణ తండా (95.71 స్కోర్).

▶ మౌలిక సదుపాయాలతో స్వయం సమృది గల పంచాయతీ: హనుమకొండ జిల్లా ఐనవోలు బ్లాక్ ఉడుతగూడెం (92.50 స్కోర్).

▶ సుపరిపాలన గల పంచాయతీ: వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి బ్లాక్ మోతుకుపల్లె (90.42 స్కోర్).

▶ మహిళా స్నేహపూర్వక పంచాయతీ: సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి బ్లాక్ ఫసల్వాది (93.24 స్కోర్).

▶ సామాజిక న్యాయం, భద్రత గల పంచాయతీ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ బ్లాక్ వెంకటంపల్లి (88.82 స్కోర్-ఏ గ్రేడ్).

గ్రామీణ ప్రాంతాల్లో 2030 నాటికి సుస్థిరాభివృద్ధి సాధించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ పీఏఐ ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొచ్చింది. పారిశుధ్యం, ఆరోగ్యం, పరిపాలన, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాలు, పర్యావరణ సుస్థిరత వంటి కీలక రంగాల్లో పంచాయతీల పనితీరును ఇది అంచనా వేస్తుంది.

**రాష్ట్ర టాపర్‌గా విట్టునాయక్ తండా..**

రాష్ట్రంలోని 31 జిల్లాలు, 553 బ్లాకుల పరిధిలోని 12,556 గ్రామ పంచాయతీలు తమ వివరాలను కేంద్రానికి సమర్పించాయి. అందులో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి బ్లాక్ పరిధిలోని విట్టునాయక్ తండా 86.41 పాయింట్లతో రాష్ట్రంలో టాప్‌లో నిలిచింది. ■

# కాశ్మీర్ వెలుపల కనువిందు చేస్తున్న కుంకుమ పువ్వు!

**పం**ట పండించాలంటే పొలం ఉండాలి. దుక్కి దున్నాలి. వాన రావాలి. ఎండ కాయాలి. కానీ ఇవేవీ లేకుండానే గదిలోనే అరుదైన కశ్మీరీ రకం కుంకుమ పువ్వు సాగు చేస్తున్నారు... అక్కాతమ్ముళ్లయిన ఆస్తిక, శంకర్ నారుల. నాన్న ఆలోచనలకు సాంకేతికతను జోడించి... లక్షలు సంపాదిస్తున్నారు. మరెందరో ఔత్సాహికులను వ్యవసాయం వైపు మళ్లిస్తున్న వారి కథ 25 ఏళ్ల ఆస్తిక మాటల్లోనే...

"జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో... ఎవరిని ఎటు నడిపిస్తుందో అస్సలు ఊహించలేం. అందుకు నా పయనమే ఒక ఉదాహరణ. అందరిలా చిన్నప్పుడు నాదీ, మా తమ్ముడు శంకర్‌దీ ఒకటే లక్ష్యం... బాగా చదువుకోవాలి. మంచి ఉద్యోగంలో స్థిరపడాలి. ఏ లోటూ లేకుండా జీవితం సాగిపోవాలి. కానీ కాలం మా ప్రయాణంలో అనుకోని మజిలీని పరిచయం చేసింది. ఆ మజిలీనే చివరకు మా జీవితాశయం అయింది. పంజాబ్ రాష్ట్రం లుథియానా మాది. నేను పొలిటికల్ సైన్స్‌లో, తమ్ముడు కంప్యూటర్స్ అప్లికేషన్స్‌లో డిగ్రీలు చేశాం. నా డిగ్రీ అవ్వగానే ఉద్యోగం చూసుకోవాలని అనుకున్నా. సరిగ్గా అదే సమయంలో నాన్న వికాస్ మా ముందు కొత్త ప్రతిపాదన పెట్టారు.

**నాన్న ఆలోచన...**

మా నాన్న బ్యాంకు మాజీ ఉద్యోగి. ఆయనకు మొదటి నుంచీ విభిన్నమైన వ్యవసాయ పద్ధతులంటే ఆసక్తి. అలాగని మా కుటుంబంలో ఎవరికీ వ్యవసాయ రంగంలో ప్రవేశమే లేదు. పదవీ విరమణ తరువాత నాన్న కుంకుమ పువ్వు గురించి చదవడం మొదలుపెట్టారు. అందులో ఉండే సాగు పద్ధతులేంటి, ప్రకృతి వైపరీత్యాలను ఎలా తట్టుకోవాలి, పెట్టుబడి, రాబడి వివరాలన్నీ సేకరించారు. ఆయన్ని బాగా ఆకట్టుకున్న అంశం... నేలతో, ఎండ, వానలు, రుతువుల మార్పులతో సంబంధం లేకుండా ఇండోర్‌లో పండించే విధానం.

**లాక్‌డౌన్‌లో శ్రీకారం...**

కరోనాతో ప్రపంచం స్తంభించిన వేళ... నాన్న తన ఆలోచనకు రూపం ఇవ్వాలని అనుకున్నారు. ముఖ్యంగా ఇరాన్, అమెరికాల్లో అధునాతన పద్ధతుల్లో జరుగుతున్న కుంకుమ పువ్వు సాగు అన్నిటికంటే ఆయనకు బాగా నచ్చింది. ఆ వివరాలను మా ఇద్దరితో పంచుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నాణ్యమైన కుంకుమ పువ్వు, అదీ కశ్మీరీ రకానికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని... దాన్ని సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. మమ్మల్ని కూడా అటు వైపు రమ్మన్నారు. మొదట్లో నేను, తమ్ముడు అస్సలు ఒప్పుకోలేదు. 'ఇది అయ్యే పని కాదులే' అంటూ నాన్నకు చెప్పేశాం. మాకూ ఎంతో ఆసక్తిగా అనిపించింది కానీ... అందులోకి దిగితే జీవితం ఉండదని భావించాం. అయితే లాక్‌డౌన్‌తో ఇంట్లోనే ఉన్నాం కదా... ఆ ప్రక్రియనంతటినీ నిశితంగా గమనించాం.



ఆ క్రమంలో మాకు తెలియకుండానే ఆసక్తి ఎక్కువైంది. ప్రధానంగా డిమాండ్‌కు, ఉత్పత్తికి మధ్య పెద్ద అంతరం ఉందని గుర్తించాం. ప్రయత్నం ఫలిస్తే మంచి ఆదాయ మార్గంగా మారుతుందని గ్రహించాం. అలా నాన్నతో కలిసి కార్యక్షేత్రంలోకి దిగాం.

**నాలుగేళ్ల పరిశోధన...**

మా కుటుంబంలో ఎవరికీ వ్యవసాయం గురించి అవగాహన లేకపోవడంవల్ల... ముందుగా దానిపై దృష్టి పెట్టాం. ఆధునిక వ్యవసాయ పద్ధతుల మీద అందుబాటులో ఉన్న పరిశోధన పత్రాలు, పాఠ్య పుస్తకాలు... అన్నీ చదివాం. శాస్త్రవేత్తలను కలిశాం. నెల రోజులపాటు కశ్మీర్ వెళ్లి, అక్కడి

కుంకుమ పువ్వు సంప్రదాయ సాగు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాం. గూగుల్ స్కాలర్, ఐటీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్), ఆర్క్ (అగ్రికల్చరల్ రీసెర్చ్ కమ్యూనికేషన్ సెంటర్)ల నుంచి పరిశోధనా పత్రాలు కొనుగోలు చేశాం. మాకు అర్థమైంది ఏంటంటే... ఇండోర్ ఫార్మింగ్ వెనుక ఉన్న శాస్త్ర, సాంకేతిక అంశాలు చాలా సంక్లిష్టమైనవే కానీ, ఆచరణలో పెట్టడం అసాధ్యం కాదని. నాలుగేళ్ల పరిశోధన తరువాత పూర్తి స్థాయి సమాచారం, అవగాహనతో రెండేళ్ల కిందట 'గ్రో గ్రోవర్' పేరుతో కశ్మీరీ రకం కుంకుమ పువ్వు ఇండోర్ ఫార్మింగ్‌కు శ్రీకారం చుట్టాం.

**ప్రయోగశాల...**

ఈ సాగు చాలా సున్నితమైనది. అధిక శ్రమతో కూడుకున్నది. అయితే దాని ఆదాయం కూడా అదే స్థాయిలో వస్తుంది. కిలోకు 1.5 లక్షల పువ్వులు కావాలి. నాణ్యతను బట్టి మార్కెట్‌లో కిలో ధర 3 లక్షల నుంచి 15 లక్షల వరకు పలుకుతుంది. కశ్మీరీ కుంకుమ పువ్వు ప్రత్యేకత ఏంటంటే... గాఢమైన రంగు, ఘాటైన సువాసన, అందులోని ఔషధ గుణాలు. ఇంత విలువైన పంట సాగు క్రమంగా తగ్గిపోతోంది. అవసరమైన మేరకు ఉత్పత్తి లేదు. ఎక్కువగా ఇరాన్ నుంచి భారత్ దిగుమతి చేసుకొంటోంది. మేం కశ్మీర్ తరహా వాతావరణాన్ని ఏరోపోనిక్ సాంకేతికత సాయంతో లుధియానాలోని ఒక పెద్ద గదిలో సృష్టించాం. ఈ విధానంలో మొక్కలు మట్టి లేకుండా, గాలిలో లేదంటే పొగ మంచులో పెరుగుతాయి. సెన్సార్లు తదితర ప్రత్యేక ఏర్పాట్లతో గది లోపలి వాతావరణాన్ని మనమే నియంత్రిస్తాం. ఇందులో నాలుగు అంశాలు... ఉష్ణోగ్రత, తేమ, కార్బన్‌డయాక్సైడ్, కాంతి ఇమిడివుంటాయి. వాస్తవానికి ఇది వ్యవసాయ క్షేత్రంలా కాకుండా ఒక ప్రయోగశాలలా అనిపిస్తుంది."

**లాభాల పంట...**

'గ్రో గ్రోవర్' కోసం 55 లక్షలు పెట్టుబడి పెట్టాం. రెండేళ్ల అలుపెరుగని కృషి తరువాత మొదటి పువ్వు పూసింది. అది చూసి మా కళ్లు చెమర్చాయి. బిడ్డ పుట్టినప్పుడు పొందిన అనుభూతి. భావోద్వేగం. తొలి పంట చేతికి వచ్చింది. ఇన్నేళ్ల కష్టానికి గానూ 1.3 కిలోల కుంకుమ పువ్వు ఉత్పత్తి అయింది. 17 లక్షల ఆదాయం లభించింది. ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలకు ఎగుమతి చేశాం. మొత్తంగా ఇప్పటికి 26 లక్షలు దీని ద్వారా ఆర్జించాం. చుట్టుపక్కల రైతులకు కూడా ఈ సాగు విధానంపై అవగాహన కల్పిస్తున్నాం.

## ఆశాజనకంగా ఎంటీయూ 1426 రకం వరి!

సన్నగింజ వరి రకాల అభివృద్ధిలో భాగంగా మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం గత సంవత్సరం ఎంటీయూ 1426 అనే వరి రకాన్ని రూపకల్పన చేశారని ఏడీఆర్ డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. ఈ రకం ప్రస్తుతం మొదటి సంవత్సరం పూర్తిచేసుకుని రెండవ సంవత్సరం క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నదన్నారు. పోడూరు మండలం పండితవిల్లూరు గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు శ్రీ నెక్కంటి అచ్యుతరామయ్య ఈ దాళ్వాలో మార్టేరు పరిశోధన స్థానం నుంచి విత్తనం తీసుకువచ్చి తన ఎకరం విస్తీర్ణంలో ఈ రకాన్ని సాగు చేశారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జె. దయాళ్ ప్రసాద్‌బాబు, డాక్టర్ ఎంవీ కృష్ణాజీలు ఈ రకాన్ని పరిశీలించి మంచి దిగుబడి రావచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు.

**గింజ పొట్టిగా.. సన్నగా.. తినటానికి బాగుంటుంది!**

నూతన రకాన్ని సాగు చేసిన రైతు మాట్లాడుతూ ఈ రకం సుమారుగా 125 రోజులు పంట కాలం వస్తుందని, గింజ ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204 కన్నా పొట్టిగా సన్నగా ఉన్నది కనుక తినడానికి బాగుంటుందని తెలిపారు. సగటున దుబ్బుకు 20 నుంచి 25 వరకు పిలకలు వేసి చక్కటి కంకి కలిగి ఉందని తెలిపారు. మెడవిరుపు తెగుళ్ళను తట్టుకోవడం వల్ల సస్య రక్షణ మందులపై పెట్టే ఖర్చు ఎకరాకు సుమారు రూ. 3 వేలు వరకు ఆదా అయ్యిందన్నారు. మొక్క కొంచెం పొడవుగా ఎదిగినప్పటికి ఎక్కడా పడిపోలేదని తెలిపారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంటీయు 1121, ఎన్ఎల్ఆర్ 34449 రకాలను సంకర పరిచి ఎంటీయూ 1426 రకాన్ని రూపొందించామన్నారు. పొట్టి మరియు సన్న గింజ కలిగి ఉండటం వల్ల వినియోగదారులు ఈ రకాన్ని ఇష్టపడటానికి అవకాశం ఉందన్నారు. వెయ్యి గింజల బరువు కేవలం 13.2 గ్రాములు మాత్రమే అన్నారు.

నీవెంత తెలివైనవాడివనుకున్నా , ఇతరులనుంచి నేర్చుకోవలసింది ఎప్పుడూ వుంటుంది

# ఆంధ్రప్రదేశ్ లోనూ యాపిల్ పంట

**చ**ల్లని, మంచు ప్రదేశాల్లో పండే యాపిల్ పంట ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కూ విస్తరించింది. ఉద్యాన పంటలకు నిలయంగా మారిన రాయలసీమలో యాపిల్ సాగు ప్రారంభమైంది. అనంతపురం జిల్లా గార్లదిన్నె, కుందుర్పి, పెద్దపప్పూరు మండలాల్లో ముగ్గురు రైతులు యాపిల్ సాగు చేపట్టారు. 15 ఎకరాల్లో తోటలు వేశారు. స్థానిక పరిస్థితుల్లో బాగా దిగుబడినిచ్చే కాశ్మీర్ లోచిల్లీ డెలిషియస్ (కేఎల్‌డీ) రకాన్ని రైతులు పండిస్తున్నారు. గార్లదిన్నె మండలం కోటంకా గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి రెండున్నర ఎకరాల్లో ఆపిల్ వేశారు. 2024 జూలైలో 1,500 మొక్కలు నాటారు. ఒక్కో మొక్క ఖరీదు రూ. 280. మొక్కలకు పశువుల కంపోస్ట్‌తోపాటు యూరియా, పొటాష్, ఫాస్పేట్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు వాడుతున్నారు. తెగుళ్లు, కీటకాలు ఆశించకుండా కాయలకు కవర్లు తొడుగుతున్నారు. డిసెంబరులో పూతకు వచ్చిన చెట్లు.. ఇప్పుడు కాయలు కాసి, కోతకొచ్చాయి. మొదటి పంట కాస్త తక్కువగా ఉన్నా.. ఎకరానికి సుమారు టన్ను దిగుబడి వచ్చిందని చెప్తున్నారు. మధ్యస్థ పరిమాణంలో ఉండే ఈ యాపిల్ పండ్లు కాశ్మీర్ ఆపిల్ కన్నా తియ్యగా, రుచిగా ఉన్నాయని రైతులు తెలిపారు. మార్కెట్‌లో నాణ్యమైన ఈ పండ్లకు కిలోకి రూ. 170, మధ్యస్థ నాణ్యతకి రూ. 120 దాకా పలుకుతోంది. దానిమ్మ మాదిరిగానే రెండో ఏడాది నుంచి కోత ప్రారంభమౌతుంది. ఎక్కడో కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో పండే యాపిల్ ఇప్పుడు ఏపీలోనూ ఉత్పత్తి చేసే పరిస్థితి వచ్చింది.

**దిగుబడి పెరుగుతుంది: ఉద్యాన శాఖ డైరెక్టర్**

సరైన యాజమాన్యంతో రానున్న రోజుల్లో సీమలో ఆపిల్ దిగుబడి మెరుగుపడుతుందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. అనంతపురం జిల్లాలో మొదటిసారి సాగైన 'అనంత యాపిల్స్'ను.. పండ్ల గిన్నెగా గిఫ్ట్ ప్యాక్లుగా చేసి విక్రయిస్తున్నారు. మంచి రుచిగా ఉండటంతో స్థానికంగా మంచి డిమాండ్ వచ్చింది. ఇటీవల అనంతపురంలో జలధార కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు ఒక స్టాల్‌లో ఏర్పాటు చేసిన 'అనంత యాపిల్' గిఫ్ట్ ప్యాక్‌ను పరిశీలించి, ఏపీలోనూ యాపిల్ సాగు చేపట్టడాన్ని ప్రశంసించారు. అధిక ఉష్ణోగ్రతలు ఉండే అనంతపురం జిల్లా వాతావరణ పరిస్థితుల్లోనూ హాట్ జోన్ యాపిల్ ఉత్పత్తిపై పరిశీలన కోసం ఉద్యాన శాఖ శాస్త్రవేత్తల బృందాన్ని ఏర్పాటు చేసింది. అనంత యాపిల్‌పై అధ్యయనం చేసి, రానున్న రోజుల్లో రాయలసీమతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లోనూ యాపిల్ సాగును ప్రోత్సహించాలని భావిస్తున్నట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

**ప్రయోగాలే ఆయన విజయం!**

అనంతపురం జిల్లా పేరు చెబితేనే మండే ఎండలు, కరువు గుర్తుకు వస్తాయి. అలాంటి నేలపై మంచు ప్రాంతాల్లో పండే యాపిల్‌ను సాగు చేసి, విజయం సాధించారు రైతు రమణారెడ్డి. రెండున్నర ఎకరాల్లో 1500 యాపిల్ మొక్కలు నాటి, తొలి పంటను టన్ను



రూ. 1.50 లక్షలకు విక్రయించి, ఔరా అనిపించుకున్నారు. రమణారెడ్డి అనంతపురం నగరంలోని సిండికేట్ నగర్‌లో ఉంటూ.. మగ్గం నేస్తూ, పట్టు చీరల వ్యాపారం చేశారు. వ్యాపారంలో వచ్చిన లాభాలతో గార్లదిన్నె మండలం మర్తాడు, కోటంక గ్రామాల్లో 13 ఎకరాలు కొన్నారు. తొలుత నాలుగెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, మరో మూడెకరాల్లో ఖర్జూర పంట వేసి, లాభాలు ఆర్జించారు. ఆ తర్వాత యాపిల్ పంట సాగు చేసినా ఉష్ణోగ్రతలు అనుకూలించక దిగుబడి రాలేదు. అయినా వెనక్కు తగ్గకుండా.. అనంతపురం జిల్లా వాతావరణానికి తట్టుకునే యాపిల్ రకాల కోసం

# ఇక డ్వాక్రా మహిళలు 'సంపన్నకారులు'!

ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది. సంఘ మహిళలు చేస్తున్న వ్యాపారాలను మరోస్థాయికి తీసుకువెళ్లేందుకు అవసరమైన శిక్షణ, ఇతర సహకారాన్ని అందించేలా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు చెందిన ఇంక్యుబేషన్ అండ్ స్టార్టప్ కేంద్రం (ఐఐఎంవీ ఫీల్డ్)తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సెర్ప్ ఒప్పందం చేసుకుంది.

ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో ఎంపిక చేసిన 150 డ్వాక్రా సంఘాలకు (వ్యాపారం చేస్తున్నవాటికి మాత్రమే) ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లో రెండేళ్లపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ప్రోగ్రామ్‌కు 'సంపన్నకారి' అనే పేరును నిర్ణయించారు. ఆయా వ్యాపారాల అభివృద్ధి, విస్తరణకు అవసరమైన ఫండింగ్ సపోర్ట్, మార్కెట్ లింకేజీలు, కెపాసిటీ బిల్డింగ్, మెంటార్‌షిప్, బ్రాండింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం డ్వాక్రా మహిళలు చేసే వ్యాపారాలకు మార్కెట్‌ను విస్తరించడం, ఆదాయం పెంచడం. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు వ్యవసాయేతర జీవనోపాధి మార్గాలను బలోపేతం చేయడం లక్ష్యంగా సంపన్న కారిని అమలు చేయనున్నారు. ఆహారశుద్ధి, చిన్నతరహా తయారీ, సేవల రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహించనున్నారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. శిక్షణ, మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం ద్వారా స్థిరమైన గ్రామీణాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా సంపన్నకారిని అమలుచేస్తున్నట్టు ఐఐఎం అధికారులు చెబుతున్నారు.

వీటికి ప్రాధాన్యం..

సంపన్నకారి ప్రోగ్రామ్‌లో శిక్షణకు డ్వాక్రా సంఘాలకు చెందిన వ్యాపార సంస్థలను ఎంపిక చేయనున్నారు. సుమారు రూ.12 లక్షల టర్నోవర్ ఉన్న వ్యాపారాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రారంభదశలో ఉన్న కొత్త వ్యాపారాలకు దాదాపు పది శాతం అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా ఆదాయాన్ని పెంచడం, బ్రాండింగ్, మార్కెటింగ్ మెరుగుపరచడం, ఖర్చులను తగ్గించడం, లాభదాయకతను పెంచడమే లక్ష్యంగా ఐఐఎంవీ ఫీల్డ్‌లో శిక్షణ అందించనున్నారు. వార్షికంగా 15 శాతం వృద్ధి సాధించేలా సంపన్నకారి ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తారు. ఆయా వ్యాపార సంస్థల పనితీరు ఆధారంగా చాలెంజ్ గ్రాంట్స్, సబ్సిడీ లేదా వడ్డీ రుణాలను అందించేందుకు అవసరమైన సహకారాన్ని ఐఐఎంవీ ఫీల్డ్ అందిస్తుంది. తొలుత 500 నుంచి వేయి దరఖాస్తులను ఎంపికచేసి తరువాత ఫీల్డ్ విజిట్ చేస్తారు. అనంతరం వాటిలో 150 వ్యాపారాలను ఎంపికచేసి అవసరమైన సహకారాన్ని అందిస్తారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.పది కోట్లు అందిస్తోంది. ఇందులో రూ.6 కోట్ల వరకు మహిళలకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు వినియోగించనున్నారు. దరఖాస్తు చేయాలనుకునే స్వయం సహాయక సంఘాల మహిళలు యాప్‌లో లాగిన్ అవుతారు. అక్కడ పూర్తిగా తెలుగులో సంబంధించిన అంశాలను ఇవ్వడం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ■

---

యూట్యూబ్‌లో సోధించి, ఇక్కడి కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండే ఇజ్రాయెల్‌లో కూడా యాపిల్ పండిస్తున్నారని తెలుసుకున్నారు. 2024 అక్టోబరులో ఇజ్రాయెల్‌లో ఉన్న తన స్నేహితుడి ద్వారా కేఎల్‌డీ రకం యాపిల్ మొక్కలు రప్పించుకున్నారు. రెండున్నర ఎకరాల్లో మొక్కలు నాటారు. ఏడాదికి పూత వచ్చి పిందెలు వచ్చాయి. యాపిల్ విరగకాయడంతో ఒక్కో మొక్కకు 130-150 పిందెలను ఉంచి, మిగిలిన వాటిని తొలగించాడు. దీంతో ఉన్న కాయలు నాణ్యంగా, లావుగా వచ్చాయి. యాపిల్ సాగు ఆసక్తి ఉన్నవారు 9490856363కు ఫోన్ చేస్తే సలహాలు ఇస్తానన్నారు. ■

# ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక

ప్రకృతి వ్యవసాయాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా వ్యాప్తిలోకి తేవాలన్న లక్ష్యంతో సమగ్రమైన ట్రైనింగ్ మాన్యువజీలు కేంద్ర ప్రభుత్వ సంస్థ సీతి ఆయోగ్ ఇటీవలే వెలువరించింది. 'రైతులకు సాధికారత కల్పించటం: ప్రకృతి వ్యవసాయ శిక్షణా కిట్ – ఉత్తమ పద్ధతుల మార్గదర్శిని' పేరుతో రూపొందించారు. ప్రకృతి సేద్య మూల సూత్రాలతో పాటు.. ముఖ్యమైన 22 రకాల పంటల సాగులో క్షేత్రస్థాయిలో ఆచరించదగిన ప్రామాణిక ప్రకృతి సేద్య పద్ధతులను పొందుపరిచారు. నీతి ఆయోగ్ వ్యవసాయం–సాంకేతిక విజ్ఞాన విభాగం ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలం పటేల్ కన్సల్టెంట్ పరిమల్ బనఫర్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం దీన్ని రూపొందించింది.

రైతులు, విస్తరణ సిబ్బంది, విధాన నిర్ణేతలకు సుస్థిర వ్యవసాయ విస్తరణ దిశా నిర్దేశం చేయటానికి ఈ శిక్షణా మాన్యువల్, ఉత్తమ ప్రకృతి సేద్య పద్ధతులకు అక్షర రూపం ఇచ్చినట్లు నీతి అయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ పేర్కొన్నారు. డాక్టర్ నీలం పటేల్ ఇలా అన్నారు. 'దేశవ్యాప్తంగా రైతులు అనుసరిస్తున్న ప్రకృతి సేద్య పద్ధతులు, ఆవిష్కరణలు, సంప్రదాయ విజ్ఞానంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రకృతి సేద్య అనుభవాల ఆధారంగా ఈ శిక్షణా మాన్యువల్‌ను రూపొందించాం.

దేశంలో సుస్థిర వ్యవసాయాన్ని విస్తరింపజేయటంలో ఇదొక కీలక ముందడుగు. ప్రకృతి వ్యవసాయ వారసత్వాన్ని సుసంపన్నం చేసిన సుభాష్ పాలేకర్ (మహారాష్ట్ర), ఎల్. నారాయణరెడ్డి (కర్ణాటక), శ్రీపాద దబోల్కర్, జి. నమ్మాళ్వార్ (తమిళనాడు), దీపక్ సత్తే (మధ్యప్రదేశ్), భాస్కర్ సావే (గుజరాత్)ల సేవలను ఇందులో ప్రస్తుతించారు. దేశవ్యాప్తంగా ప్రకృతి సేద్య పథకాలు అమలవుతున్నాయని, 9.4 లక్షల హెక్టార్లలో సుమారు 10 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఇందులో పేర్కొన్నారు.

**అధిక దిగుబడి.. అధిక నికరాదాయం!**

వరిని వరుసగా 4 ఏళ్లు ప్రకృతి వ్యవసాయం (ప్ర.వ్య.)లో పండిస్తే 2023 ఖరీఫ్ ఎకరానికి 33.75 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. రసాయన వ్యవసాయం (ర.వ్య.)లో 31.5 క్వింటాళ్లు వచ్చింది. ఈ రెండు: ధాన్యాలను క్వింటా రూ. 2,040కే విక్రయించారు. ప్ర.వ్య.లో నికరాదాయం రూ. 48 వేలు రాగా, రూపాయి ఖర్చుకు 2.3 రూపాయల ఆదాయం వచ్చింది. ర.వ్య.లో నికరాదాయం రూ. 35,140 లాగా, రూపాయి ఖర్చుకు 1.2 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చింది.

ప్రధాన పంటలన్నింటిలో సాగు ఖర్చును కనీసం 5–10% తగ్గిస్తుంది. మరికొన్ని పంటల్లో, కొన్ని రాష్ట్రాల్లో 20–55% వరకు తగ్గింది. ప్రకృతి వ్యవసాయం రైతులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

– నేలల్లో సేంద్రియ కర్బనం 1947లో 2.5% ఉండేది. ఇప్పటికి 0.4%కి తగ్గింది. ప్రకృతి వ్యవసాయం దీన్ని 45% వరకు పెంచుతుంది. నీరు, విద్యుత్ 50–60% ఆదా అవుతుంది. కర్బన ఉద్గారాలను 55–85% తగ్గిస్తుంది. పశువులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెంచటం రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

పంటల వైవిధ్యం, అంతరపంటలు, బహుళ అంచెల పంటలతో వ్యవసాయాదాయ భద్రత, పోషకాహార భద్రత పెరుగు తాయి. రసాయనిక సేద్యం ఏకపంట సాగుతో పోలిస్తే 20–40% అధిక నికర ఆదాయం వస్తుంది.

**జీవామృతం.. 48 గంటలు పులిస్తే చాలు!**

జీవామృతం కోసం పేడ, మూత్రం, పప్పుల పిండి, బెల్లం, మట్టిని డ్రమ్ము నీటిలో కలిపిన తర్వాత 2–3 రోజులు పులియబెట్టి పంటలకు వాడుకోదానికి సిద్ధమైనట్లే. కలిపిన 48 గంటల్లో బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో వృద్ధి చెందుతుంది. సిద్ధమైన జీవామృతాన్ని వేసవిలో 7 రోజుల వరకు,

# దోస, గుమ్మడి సాగుతో రెండు నెలల్లో రూ. 2 లక్షలు!

**నే**టి కాలంలో వ్యవసాయం అంటే కేవలం శ్రమ మాత్రమే కాదు, సరైన ప్రణాళికతో కూడిన లాభదాయకమైన వ్యాపారం అని అరారియా జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన రైతు మహ్మద్ అన్వర్ న్యూస్ 18 హిందీతో అన్నారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా కూరగాయల సాగుపై దృష్టి సారించిన ఆయన, రెండు ఎకరాల్లో దోసకాయ, ఒక ఎకరంలో గుమ్మడి జాతి సాగు చేస్తూ ఏడాదికి లక్షల్లో సంపాదిస్తున్నారు.





---

శీతాకాలంలో 8-10 రోజుల్లో వాడుకోవచ్చని నీతి ఆయోగ్ ప్రకృతి వ్యవసాయ శిక్షణ మాన్యువల్ చెబుతోంది.

**ప్రకృతి సేద్యానికి మార్గదర్శకం**

రసాయనిక వ్యవసాయానికి ఒక సుస్థిరమైన ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయం. ఇటు సంప్రదాయ విజ్ఞానాన్ని అటు ఆధునిక పర్యావరణ విజ్ఞానాన్ని ఇముడ్చుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రూపొందాయి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దీటైన సమాధానాలు ఇవ్వగలవు, తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతోనే వ్యవసాయానికి సుస్థిరత చేకూర్చటం సాధ్యమని ఈ పద్ధతులు చాటి చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా రైతులకు, విస్తరణ సిబ్బందికి ప్రకృతో సేద్య పద్ధతులపై శిక్షణ ఇవ్వటానికి ఈ మాన్యువల్ మార్గదర్శకంగా నిలుస్తుంది.

– ప్రొఫెసర్ రమేశ్ చంద్, వ్యవసాయ ఆర్థికవేత్త, నీతి ఆయోగ్ సీనియర్ సభ్యులు ■

మహ్మద్ అన్వర్ తన పొలంలో ఒక ప్రత్యేకమైన పద్ధతిని అనుసరిస్తున్నారు. దోసకాయ తీగలు నేల మీద పాకకుండా, వెదురు కర్రలు, తాళ్ల సహాయంతో పందిరి సిద్ధం చేస్తారు. తీగలు పైకి పాకడం వల్ల కాయలు నేలకు తగలవు. దీనివల్ల కాయలు కుళ్లిపోకుండా ఉండటమే కాకుండా, వాటి నాణ్యత, రంగు మెరుగ్గా ఉంటుంది. మార్కెట్‌లో ఇటువంటి నాణ్యమైన కాయలకు మంచి ధర లభిస్తుంది.

వేసవి కాలంలో దోసకాయలకు డిమాండ్ విపరీతంగా ఉంటుంది. శరీరానికి చలవనిచ్చే గుణం ఉండటంతో ప్రజలు వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఈ పంటకు పెట్టుబడి చాలా తక్కువ. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల వాడకానికే అన్వర్ ప్రాధాన్యత ఇస్తారు.

దోసకాయకు అతిగా నీరు అవసరం లేదు. కేవలం వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఒకటి రెండుసార్లు తడి ఇస్తే సరిపోతుంది. మిగిలిన సమయాల్లో తేలికపాటి తేమ ఉన్నా పంట బాగా పండుతుంది. ఒక సీజన్‌లో సుమారు రూ. 2 లక్షలకు పైగా లాభం పొందుతున్నట్లు అన్వర్ తెలిపారు.

దోసకాయ సాగు చేయాలనుకునే రైతులు ఈ క్రింది విషయాలను గమనించాలి. వేడి, తేమతో కూడిన వాతావరణం ఈ పంటకు చాలా మంచిది. 20 నుండి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద పంట దిగుబడి బాగుంటుంది. నీరు నిలవకుండా ఉండే గరప నేలలు లేదా ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అత్యంత అనువైనవి. మట్టి పిహెచ్ విలువ 6.0 నుంచి 7.5 మధ్య ఉండటం శ్రేయస్కరం. ■

**విజయం అంటే ఆశించిన దాన్ని సాధించడం కాదు, సాధించి తీరవలసినదాన్ని ఆశించడమే**

# హిందూమహిళ వారసత్వ ఆస్తిపై భర్తకు హక్కు వుండదు

**హిం**దూ మహిళకు తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తిపై ఆమె భర్తకు ఎలాంటి హక్కు ఉండదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ మహిళ సంతానం లేకుండా చనిపోతే ఆ ఆస్తి తిరిగి ఆమె తండ్రి వారసులకే చెందుతుందని చెప్పింది. తన సోదరి శ్రీవిరిత మరణం నేపథ్యంలో ఆమెకు వారసత్వంగా తమ నాయనమ్మ నుంచి సంక్రమించిన భూమి తాలూకు రెవెన్యూ రికార్డుల్లో తన పేరును నమోదు చేయాలని కోరుతూ దేవిక మానస దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతిస్తూ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ఆర్‌డిఓ ఉత్తర్వులను రద్దుచేస్తూ జాయింట్ కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను తప్పుబట్టింది. జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులను రద్దుచేసింది. రికార్డుల్లో దేవిక మానస పేరు చేర్చాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు చెప్పారు.

**మనుమరాళ్లకు ఆస్తి ఇచ్చిన నాయనమ్మ**

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన చిక్కాల వెంకాయమ్మ తన మనుమరాలు (కుమారుడు దత్తాత్రేయ కుమార్తె) శ్రీవిరితకు 1.50 ఎకరాల భూమిని 2002లో గిఫ్ట్‌డీడ్ కింద ఇచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులు రికార్డుల్లో శ్రీవిరిత పేరు మీద మార్పులు చేశారు. 2005లో శ్రీవిరిత మరణించడంతో ఆ గిఫ్ట్‌డీడ్‌ను వెంకాయమ్మ 2007లో రద్దుచేశారు. ఆ భూమిని 2011లో మరో మనుమరాలు దేవిక మానసకు గిఫ్ట్ ద్వారా ఇచ్చిన వెంకాయమ్మ 2012లో కన్నుమూశారు. అనంతరం ఆ 1.50 ఎకరాల భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో తనపేరు చేర్చాలని దేవిక మానస తహసీల్దార్‌ను కోరారు. దీనికి శ్రీవిరిత భర్త బదిరెడ్డి నాగవీరవెంకట శ్రీరామదొర అభ్యంతరం తెలిపారు.

ఆ భూమి తన భార్యదని, దానిపై తనకే హక్కులున్నాయని పేర్కొన్నారు. దీంతో తహసిల్దార్ ఆయనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. దీన్ని సవాలు చేస్తూ దేవిక మానస రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ)ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ఆర్‌డిఓ.. తహసిల్దార్ ఉత్తర్వులను తప్పుబట్టి, రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేయాలని 2017లో ఆదేశించారు. దీనిపై శ్రీరామదొర జాయింట్ కలెక్టర్ (జేసీ) ముందు రివిజన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జేసీ 2017లో ఆర్‌డిఓ జారీచేసిన ఉత్తర్వులను తప్పుబట్టారు. ఒకసారి గిఫ్ట్‌డీడ్ ఇచ్చిన తరువాత దాన్ని రద్దు చేయడానికి వీల్లేదని, సివిల్ కోర్టు ద్వారా మాత్రమే ఆ డీడ్‌ను రద్దుచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. **(సాక్షి,సౌజన్యంతో)**

**అన్నదాతల ఆధ్వర్యంలో 'తెలుగుదనం' వికాసం!**

(8 వ పేజీ తరువాయి)

పద్యాలు, మహనీయుల వీర గాథలు, ఒగ్గు కథలు, బుర్ర కథలు, హరి కథలు, సాంప్రదాయ నృత్యాలు గో ఆధారిత వ్యవసాయం పై నిరంతర కార్యశాలలు, వాన నీటి సంరక్షణపై అవగాహన, జల వనరులు, భూగర్భ జలాలు పెంపొందించుకునే పాఠాలు. దీనిని ఒక సొసైటీ క్రింద ఏర్పాటు చేస్తే ప్రకృతి వ్యవసాయ రైతులకు, ప్రభుత్వానికి ఆదాయం.

దేశీ విత్తన నిధి,వినాయక మట్టి విగ్రహాల శిక్షణ, తెలుగు వంటల పాకశాస్త్రం పై శిక్షణ, దేశవాళీ ఆవులు, పాడి పరిశ్రమ నమూనా, దేశీ ఆవుల పెంపకం వాటి ఉత్పత్తుల పై శిక్షణ,ఎద్దు గానుగల ఉత్పత్తి , శిక్షణ, తెలుగు మిఠాయిలు, తెలుగు పచ్చళ్ళ పై శిక్షణ,

తెలుగు వారి సాంప్రదాయ తలకట్టు, పంచెకట్టుపై శిక్షణ, మట్టి ప్రమిదలు, మన పండుగలకు సంబంధించి గ్రామంలో తయారు చేయదగ్గ ప్రతి వస్తువుపై శిక్షణ , ఆ వస్తువులన్నీ వినియోగదారులకు అందుబాటులో ఉంచే ఏర్పాటు. విద్యార్థులకు ఆ జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ రైతుల క్షేత్రానికి విహార యాత్రలు ... ఇలా విజయరామ్ గారు తెలుగుదనం స్వరూప స్వభావాలను వివరించారు. ■

# వాననీటి సంరక్షణలో ప్రకాశించిన 'ప్రకాశం' గ్రామాలు!

ప్రజల భాగస్వామ్యంతో వర్షపు నీటి సంరక్షణ సాధ్యమని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మురుగమ్మి, మారెళ్ల, తంగెళ్ల గ్రామాలు నిరూపించాయి.

ఈ గ్రామాలు భూగర్భ జల మట్టాన్ని పెంచే చర్యలతో దేశంలోనే ఆదర్శంగా నిలిచాయి. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జల్ సంచయ్ జన్ భగీదారీ' (జేఎస్జేబీ) కార్యక్రమాన్ని ఈ గ్రామాల ప్రజలు సమర్థవంతంగా అమలు చేశారు. నీటికుంటలు, చెక్‌డ్యాంలు విరివిగా ఏర్పాటు చేసి భూగర్భ జలమట్టాన్ని పెంచారు. దీంతో జాతీయ జల అవార్డులు-2024లో దేశంలోనే రెండో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును మురుగమ్మి గ్రామం దక్కించుకుంది. టాప్-30 గ్రామాల్లో ఒకటిగా మారెళ్ల గ్రామం ఎంపికైంది. జాతీయ స్థాయి గుర్తింపు కోసం తంగెళ్ల గ్రామం నామినేట్ అయింది. ఈ మేరకు డ్వామా అధికారులకు కేంద్రం నుంచి లేఖలు అందాయి.

**సంకల్పంతో ముందడుగు**

ఉమ్మడి ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలోని మురుగమ్మి, మారెళ్ల.. మర్రిపూడి మండలంలోని తంగెళ్ల గ్రామాల్లో దశాబ్దాలుగా తక్కువ వర్షపాతం నమోదవుతోంది. తీవ్ర నీటి కొరతతో ఆయా గ్రామాల్లో ప్రజలు కుటుంబాలతో సహా వలస వెళ్లేవారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించి భూగర్భ జలాల పరిస్థితిపై అధ్యయనం చేశాయి. వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేస్తే ఈ ప్రాంతాల్లో నీటి కొరత తీరుతుందని గుర్తించాయి. ఇదే విషయాన్ని వివిధ కార్యక్రమాలు, కళాజాతల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం నింపాయి. దీంతో రైతులు మహిళలు, యువత కలిసి నీటి ఆదాపై దృష్టి సారించారు. వ్యవసాయ కుంటలు, కాలువలు, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు ద్వారా వర్షపు నీటిని నిల్వ చేశారు. దీంతో వ్యవసాయ ఉత్పాదకతతోపాటు పాల ఉత్పత్తి కూడా పెరిగి అదనపు ఆదాయం సమకూరింది. ఇటీవల ఈ గ్రామాల్లో వలసలు తగ్గుముఖం పట్టాయి.

**వర్షపు నీటి సంరక్షణతో విప్లవాత్మక మార్పులు**

ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ ద్వారా ప్రకాశం జిల్లాలోని గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కేంద్ర జల మంత్రిత్వ శాఖ తెలిపింది. 'జల్ సంచయ్ జన్ భగీదారీ' ప్రచారంలో భాగంగా చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమం ద్వారా ప్రకాశం జిల్లాలోని మురుగమ్మి, మారెళ్ల, తంగెళ్ల గ్రామాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించింది. నీటి సంరక్షణ వల్ల ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగటమే కాక.. ప్రజల జీవనోపాధి మెరుగుపడి, వలసలు తగ్గిపోయాయని తెలిపింది. ఇంకుడు గుంటలు, వ్యవసాయ చెరువులు, విడతల వారీగా కందకాల ఏర్పాటు, ఇంటి పైకప్పులపై వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, చెరువుల పునరుద్ధరణ వంటి కీలక చర్యలు చేపట్టడంతో భూగర్భ జలాల మట్టం పెరిగిందని వెల్లడించింది.

**మధుమేహానికి, పాము విషానికి విరుగుడు మొక్క!**

ప్రకృతి మనకు ఎన్నో రకాల ఔషధాలను ప్రసాదించింది. యోగా గురువు పతంజలి ప్రకారం.. మన చుట్టూ ఉన్న ప్రతి మొక్కకు ఔషధ గుణాలు ఉంటాయి. కానీ సమాచారం లేకపోవడం వల్ల అందరూ దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. గుజరాత్ లో పెరిగే గుడ్మార్ కూడా అలాంటి మొక్కల్లో ఒకటి. గుడ్మార్‌ను తెలుగులో పొడపత్రి, మధునాశినిఅంటారు. దీని శాస్త్రీయ నామం జిమ్నెమా సిల్వెస్ట్రే. గుడ్మార్ మొక్కలో కొన్ని ప్రత్యేకమైన ఔషధ గుణాలు ఉన్నాయి. దీన్ని తీసుకోవడం వల్ల మహిళల్లో మధుమేహం, బీపీ, ఊబకాయం, కాలేయ వ్యాధి, చర్మ సంబంధిత సమస్యలు, పీసీఓడీ నుంచి ఉపశమనం లభిస్తుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి గుడ్మార్ ఆకులతో చేసిన ద్రావణం పాము విషం ప్రభావాన్ని తటస్థీకరిస్తుంది.

ఇద్దరి మధ్య వివాదంలో తేల్చవలసింది ఎవరి వాదన బలంగా వుందని కాదు, ఎవరి మాట నిజం అని

# మైక్రో ఇరిగేషన్‌లో ఏపీ నంబర్ వన్

**ఉ**ద్యాన తోటలకు సూక్ష్మ సేద్యం అమలులో రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు రికార్డు సృష్టించింది. 2025-26 లో 126,075 హెక్టార్లకు సూక్ష్మసేద్యం అమలుతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో గుజరాత్ (1,05,304 హెక్టార్లు), మూడో స్థానంలో తమిళనాడు (1,04,746), నాలుగో స్థానంలో రాజస్థాన్ (96,741) నిలిచాయి. రాష్ట్రంలో 1,08,163 మంది రైతులు లబ్ధి పొందారని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలో సూక్ష్మసేద్యం అమలుకు 2025-26లో రూ. 1,030 కోట్లు సబ్సిడీ కింద ప్రభుత్వం అందించింది. సూక్ష్మసేద్యం ద్వారా టమాటా, ఆయిల్‌పామ్, మిర్చి, మామిడి, బత్తాయి, అరటి, కొబ్బరి, దానిమ్మ, ఉల్లి, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, పప్పు దినుసులు సాగయ్యాయి. ఈ ఘనత సాధించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఉద్యానవన శాఖ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. "ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసిన మీ కృషి అభినందనీయం" అని అధికారులను కొనియాడారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న 1,08,143 మంది రైతులకు ఆయన శు భాకాంక్షలు తెలిపారు.

డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా నీటి ఆదాతో పాటు సాగు ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం ప్రభుత్వం రైతాంగానికి రూ. 1,030 కోట్ల మేర సబ్సిడీని అందించిందని వెల్లడించారు. టమాటా, ఆయిల్ పామ్, మిర్చి నుంచి పప్పు ధాన్యాల వరకు వైవిధ్యమైన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రైతులకు వ్యవ'సాయ' పరికరాలు

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. రాయితీతో వ్యవసాయ పరికరాలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 112 కోట్లు రాయితీని ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. రైతుల నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చినట్టయితే లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి వ్యవసాయ పరికరాలను అందజేయనున్నారు. వరి రైతులు వినియోగించుకునే విధంగా 40 హెచ్‌పీలోపు ఉండే ట్రాక్టర్‌లు, పవర్ టిల్లర్లు, వరికోత యంత్రాలు, స్ప్రేయర్‌లు తదితర పరికరాలను అందజేయాలని ప్రభుత్వం సూచించింది. మహిళా, సన్న, చిన్న కారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు 50 శాతం రాయితీతో పరికరాలను పంపిణీ చేయనున్నారు. మిగిలిన రైతులకు 40 శాతం రాయితీ కల్పించనున్నారు.

## పశువుల దాహార్తి తీర్చేలా నీటి తొట్టెలు

వేసవిలో పశువులు, జీవాలకు తాగునీటిని అందించేందుకు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో యూనిట్ విలువ రూ. 33 వేలతో రాష్ట్రవ్యాప్తంగా 13,929 నీటి తొట్టెలను నిర్మించినట్లు పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు బుధవారం తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో నీటి తొట్టెలను నింపి, పశువుల దాహార్తి తీర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పశుపోషకులు గ్రామ పంచాయతీలను సంప్రదించి, నీటి తొట్టెలను వినియోగించుకోవాలని సూచించారు. అత్యధికంగా తిరుపతి జిల్లాలో 1,445, ప్రకాశం జిల్లాలో 1,376, అన్నమయ్య జిల్లాలో 1,364, శ్రీసత్యసాయి జిల్లాలో 1,357 నీటి తొట్టెలు ఉండగా, పశ్చిమగోదావరి, కోనసీమ, పోలవరం, మార్కాపురం జిల్లాల్లో నీటి తొట్టెలు నిర్మించలేదని చెప్పారు.

మాటలు ఈటెలలాంటివి ఒకసారి పెదవిదాటితే, దూసుకపోవడంతప్ప వెనుతిరగడం వాటికి తెలియదు

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల వాడకం

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 **MAHILA SADHIKARATHA** Postal Regd No: HCD-1064/2024-26

*Publication Date:01-05-2026* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-05-2026*






మాతాశిశు సమగ్ర పోషణపై ఏపిమాస్ ఆధ్వర్యంలో భాగస్వాముల సదస్సు ... మరికొన్ని దృశ్యాలు





పోషణ్ పఖ్వాడాపై ఏపిమాస్ ఆధ్వర్యంలో విద్యార్థినుల ప్రదర్శన, మహిళల ప్రతిజ్ఞ







గుడ్లవల్లేరు మండలంలో 'బంగారు కుటుంబాల' ప్రతినిధులతో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి మాటామంతీ








పాలిచ్చే తల్లులకోసం 'మాతా శిశు సంరక్షణ కిట్స్' సిద్ధంచేస్తున్న విప్రో సిబ్బంది, ఏపిమాస్ ప్రతినిధులు

To ADDRESS



ఏపిమాస్ జాయింట్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్)
శ్రీ కుమారస్వామి 60వ పుట్టినరోజు వేడుక

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089